Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

శుక్రవారం
18 అక్టోబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 161
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

## కొత్త సీజేఐగా సంజీవ్ ఖన్నా?

- జస్టిస్ సంజీవ్ ఖన్నాకు రెండు దశాబ్దాల జుడిషియల్ అనుభవం
- మరో నెల రోజుల్లో కొత్త చీఫ్ జస్టిస్ రాబోతున్నారు.
- నవంబర్ 10, 2024న ముగియనున్న ప్రస్తుత సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ పదవీ కాలం
- తదుపరి సీజేఐగా సీనియర్ జడ్జి అయిన జస్టిస్ సంజీవ ఖన్నా పేరుని కేంద్రానికి సూచించిన డివై చంద్రచూడ్

2



## ఈ రాష్ట్రాల్లో త్వరలో గవర్నర్ల బదిలీలు

- అక్టోబర్, నవంబర్ నెలల్లో పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల గవర్నర్లను బదిలీ చేసే అవకాశం
- మూడు నుంచి ఐదు సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న రాష్ట్రాల గవర్నర్‌లను బదిలీలు చేయాలని నిర్ణయం
- ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, కేరళ, జమ్మూ కాశ్మీర్, కేంద్ర పాలిత ప్రాంతాలల్లో గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు మారే అవకాశం

2





## హర్యానా సీఎంగా నాయబ్ సింగ్ సైనీ

- ముచ్చటగా మూడోసారి కొత్త ప్రభుత్వాన్ని నెలకొల్పిన బీజేపీ
- హరియాణా సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నాయబ్ సింగ్ సైనీ
- నాయబ్ సింగ్ సైనీతోపాటు మరో 13 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు.
- ఇక్కడ సీఎం సహా 14 మంది మంత్రులు ఉండే అవకాశం

2

# మూసీకి పునరుజ్జీవం



- సుందరీకరణ కాదు.. పూర్తి ప్రక్షాళనే
- ఇందుకు పనికొచ్చే సలహా సూచనలు ఎవరిచ్చినా తీసుకుంటాం
- అందరికీ నచ్చేరీతిలో ప్యాకేజీ.. అన్ని విధాలా నిర్వాసితుల్ని ఆదుకుంటాం
- మూసీపై అఖిలపక్షం.. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలూ ఏర్పాటు చేస్తాం
- హైదరాబాద్‌ను ప్రపంచంలో గొప్ప నగరంగా తీర్చిదిద్దడానికిదే అవకాశం
- స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ, సమతామూర్తి, బుర్జ్ ఖలీఫా వంటి నిర్మాణాల్లో భాగస్వాములైన గ్లోబల్ కంపెనీలతో కలిసి కన్సార్షియం ఏర్పాటు చేశాం

**శుభ తెలంగాణ హైదరాబాద్**

"బందిపోటు దొంగల్లా తెలంగాణను పదేళ్లు దోచుకున్న వాళ్లు మూసీ పునరుజ్జీవాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. సుందరీకరణ అంటూ కాస్మెటిక్ కలర్ అద్దాలని చూస్తున్నారు. వాళ్ల మెదడులో మూసీ మురికి కంటే ఎక్కువ విషాన్ని నింపుకొన్నారు. తమ ప్రయత్నం మూసీ సుందరీకరణ కోసం కాదు. పునరుజ్జీవం కోసం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవానికే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ విషయంలో పనికొచ్చే సలహా సూచనలు ఎవరు ఇచ్చినా స్వీకరిస్తామని అన్నారు. మూసీ నిర్వాసితులకు తాము ఇవ్వాలనుకుంటున్న దానికన్నా - మిగతా3లో

## గ్రూప్-1 పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి

- అధికారులకు సీఎస్ ఆదేశం
- గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్
- గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారు
- హెచ్ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు
- అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు

**శుభ తెలంగాణ హైదరాబాద్**

ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ను ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యం త పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్ సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు, సచివాలయం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్పీడీసీఎల్ - మిగతా3లో



## 23న కేబినెట్



**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణ కేబినెట్ భేటీకి ముహూర్తం ఫిక్స్ అయింది. ఈనెల 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ భేటీలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. హైడ్రాకు చట్టబద్ధత, రైతు భరోసా, రుణమాఫీ, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వంటి అంశాలు చర్చకు రానున్నాయిఈనెల 23వ తేదీన తెలంగాణ మంత్రివర్గం సమావేశం కానుంది. సచివాల యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన - మిగతా3లో

## ఏపీలో రిపోర్టు చేసిన నలుగురు ఐఏఎస్ అధికారులు

- ఏపీకి కేటాయించినా ఇంకా తెలంగాణలోనే కొనసాగుతున్న ఐఏఎస్ లు
- ఏపీకి వెళ్లాలంటూ ఇటీవల డీవోపీటీ ఆదేశాలు
- క్యాట్ లోనూ, తెలంగాణ హైకోర్టులోనూ ఐఏఎస్ లకు నిరాశ
- నిన్న సాయంత్రం తెలంగాణ నుంచి రిలీవ్ అయిన అధికారులు
- నేడు ఏపీ సీఎస్ కు రిపోర్టు చేసిన రొనాల్డ్ రాస్, ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్

3



## ప్రశ్నించడం బంద్ అయితే.. తెలంగాణ మూగబోతది



- కేటీఆర్ కీలక వ్యాఖ్యలు
- ఎందుకంటే బీజేపోడు మాట్లాడడు
- తెలంగాణన నాశనం చేసిన బీజేపోడు మెసలడు
- బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే
- మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు.
- బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక : కేటీఆర్
- కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మనం జాగ్రత్తగా ఉండాలి

**శుభ తెలంగాణ హైదరాబాద్**

రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదు.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బంద్ అయితే.. సమాజం తరపున కొట్లాడడం బంద్ అయితే.. పేద ప్రజల తరపున మాట్లాడడం బంద్ అయితే తెలంగాణ మూగబోతది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎందుకంటే బీజేపోడు మాట్లాడడు. తెలంగాణన నాశనం చేసిన బీజేపోడు మెసలడు. బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే. పైననేమో జూమ్లా పీఎం.. ఇక్కడ్నేమో హౌలా సీఎం.. ఈయనకు ఏం తెల్వది.. ఆగమాగం అవుతున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఓ బిల్డర్ తనకు వద్దకు వచ్చి.. హైదరాబాద్‌లో - మిగతా3లో



## పెరగనున్న మద్యం ధరలు

- సాధారణంగా బీర్ల ఉత్పత్తి కేంద్రాలకు చెల్లించే ధరలను ప్రభుత్వం ప్రతి రెండేళ్లకొకసారి పెంచుతుంది.
- ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా భారీగా ఉదాయం వచ్చింది
- ఈసారి వివిధ రకాల మద్యంపై రూ. 20 నుంచి రూ. 150 పెంచాలని ప్రభుత్వాన్ని బ్రూవరీలు కోరాయి
- రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి

3

## మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధం కావాలి

- మందకృష్ణ మాదిగ పిలుపు
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ
- ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండా పోయింది
- తేనే పూసిన కత్తిలా ఆయన మాటలు ఉంటాయి
- ప్రజలను నమ్మించడంలో ఘనుడే.. మోసం చేయడంలో అంతకంటే ఘనుడు.



**శుభ తెలంగాణ హైదరాబాద్**

మాదిగలను నమ్మించి నమ్మక ద్రోహానికి పాల్పడ్డ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాల్సింది మాదిగ, ఉపకులాలకు పిలుపునిస్తున్నామని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. ఏడాది ఆగస్టు 1వ తేదీన నిండు శాసనసభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తొలుత దేశంలో తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తదని హామీ ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందన్నారు. ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఎస్సీ రిజర్వేషన్ల అమల్లో పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు ముందు వసరులో ఉన్నాయని మందకృష్ణ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ - మిగతా3లో

# ఈ రాష్ట్రాల్లో త్వరలో గవర్నర్ల బదిలీలు



**ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం అక్టోబర్, నవంబర్ నెలల్లో పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల గవర్నర్లను బదిలీ చేసే అవకాశం ఉంది. అనేక రాష్ట్రాల్లో గవర్నర్‌లు, లెఫ్టినెంట్ గవర్నర్‌లు ఇప్పటికే మూడు నుంచి ఐదు సంవత్సరాలకు పైగా పనిచేసినందునా బదిలీల ప్రక్రియ జరపాలని నిర్ణయించినట్లు తెలిసింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, కేరళ, జమ్మూ కాశ్మీర్, కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూలలో గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు మారనున్నారు. జమ్మూ కశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నాలుగేళ్లకు పైగా పదవిలో ఉన్నారు. సిన్హా స్థానంలో ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధా లున్న, అసెంబ్లీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించిన బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌ను భర్తీ చేసే అవకాశం ఉందని ఊహాగానాలు జోరందుకున్నాయి. ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ఐదు ఏళ్లకుపైగా కేరళ గవర్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు వేరే పదవి ఇచ్చే అవకాశం ఉంది. అండమాన్ నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్ దేవేంద్ర కుమార్ జోషి పదవీ విరమణ చేయవచ్చు. లేదంటే కేరళ, జమ్మూ కశ్మీర్‌లకుగానూ ఆయనకు నూతన బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

**త్వరలోనే..**

కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌లు మూడేళ్లకు పైగా తమ పదవుల్లో కొనసాగుతున్నారు. జులై 15, 2021న బాధ్యతలు స్వీకరించిన గోవా గవర్నర్ %ూా% శ్రీధరన్ పిళ్లై, జూలై 15, 2021 నుండి పదవిలో ఉన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కూడా మూడేళ్లకు పైగా పదవీకాలం పూర్తి చేసుకున్నారు. అలాగే మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ సి పటేల్ ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మీత్ సింగ్‌కు సంబంధించి 3 ఏళ్ల పదవీ కాలం పూర్తయింది. ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ఐదేళ్లు... తమిళనాడు ఆర్‌ఎన్ రవి, గోవా పీఎస్ శ్రీధరన్ పిళ్లై మూడేళ్లుగా గవర్నర్ పదవిలో ఉన్నారు. మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత పునర్వ్యవస్థీకరణ జరగవచ్చని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయని సీనియర్ బీజేపీ నేతలను గవర్నర్ లేదా ఎల్‌జీలుగా నియమించే అవకాశం ఉంది. మాజీ ఎంపీలు అశ్వనీ చౌబే, వీకే సింగ్, ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ ఈ జాబితాలో ఉన్నాయి.

# కొత్త సీజేఐగా సంజీవ్ ఖన్నా?

**న్యూఢిల్లీ :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా మరో నెల రోజుల్లో కొత్త చీఫ్ జస్టిస్ రాబోతున్నారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా(సిజెఐ) డివై చంద్రచూడ్ సుప్రీం కోర్టు సీనియర్ జడ్జి అయిన జస్టిస్ సంజీవ ఖన్నా పేరుని కేంద్రానికి సూచించారు. గత శు క్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ కు లేఖ రాసింది. ఆ లేఖలో ఆయన తదుపరి చీఫ్ జస్టిస్ పేరుని ప్రస్తావించాలని.. మెమోరాండమ్ ప్రొసీజర్ ప్రకారం రెకమెండ్ చేయాలని అడిగింది. ప్రస్తుత సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ పదవీ కాలం నవంబర్ 10, 2024న ముగియనుంది. రెండేళ్ల క్రితం ఆయన డిసెంబర్ 17, 2022న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి భారతదేశపు 50వ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ప్రమాణ స్వీకారం చేసిన తరువాత సుప్రీం కోర్టులోని మహాత్మ గాంధీ విగ్రహానికి నివాశు లర్పించారు. జస్టిస్ డివై చంద్రచూడ్ తండ్రి వైవి చంద్రచూడ్ భారతదేశపు సుప్రీం కోర్టు లో సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు సృష్టించారు. ఆయన ఫిబ్రవరి 22, 1978 నుంచి జూలై 11, 1985 వరకు ఏడు సంవత్సరాలకు పైగా సిజెఐ పదవిలో ఉన్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా నవంబర్ 10, 2024 నుంచి మే 13, 2025 వరకు చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా పదవి చేపట్టనున్నారు. ప్రస్తుతం సుప్రీం కోర్టులో



ప్రస్తుతం సిజెఐ చంద్రచూడ్ తరువాత ఆయనే సీనియర్ మోస్ట్ జడ్డి. జస్టిస్ సంజీవ్ ఖన్నా జనవరి 2019 నుంచి సుప్రీం కోర్టులో జడ్జిగా సేవలు అందిస్తున్నారు. సుప్రీం కోర్టులో ఆయన పనితీరు, తీసుకున్న నిర్ణయాలుతో ప్రశంసలందుకున్నారు. ఆయన జుడిషియల్ కెరీర్ లో ఒక వివాదం ఉంది. సుప్రీం కోర్టు జడ్జిగా ఆయన నియామకం చాలా వివాదాస్పదంగా జరిగింది. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు సుప్రీం కోర్టు జడ్డిగా నియామక ప్రక్రియలో ఆయన కంటే 33 సీనియర్ జడ్జీలు ఉండగా.. వయసులో, అనుభవంలో చాలా చిన్నవాడైన సంజీవ్ ఖన్నాకు ఆ అవకాశం లభించింది. అయితే ఈ వివాదాన్ని జస్టిస్ సంజీవ్ ఖన్నా తన పనితీరుతో కొన్ని నెలల్లోనే అధిగమించారు. ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు.. ఎమర్జెన్సీకి నిరసనగా సుప్రీం కోర్టు జడ్జి అయిన జస్టిస్ హన్స్ రాజ్ ఖన్నా తన పదవికి రాజీనామా చేశారు. జస్టిస్ హన్స్ రాజ్ ఖన్నా సోదరుడి కుమారుడే ఈ జస్టిస్ సంజీవ్ ఖన్నా. జస్టిస్ హన్స్ రాజ్ ఖన్నా తన పదవి కాలంలో సుప్రీం కోర్టులో అందించిన సేవలకు గుర్తింపు పొందారు.

**జస్టిస్ సంజీవ్ ఖన్నాకు రెండు దశాబ్దాల జుడిషియల్ అనుభవం**

సుప్రీం కోర్టులో జడ్డిగా నియామకం పొందే ముందు జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టులో 14 సంవత్సరాలు సేవలందించారు. ట్యాక్సేషన్, కమర్షియల్ చట్టాలలో ఆయనకు మంచి పట్టు ఉంది. గత రెండు దశాబ్దాలుగా ఈ రంగాలలో ఆయన పలు కీలక తీర్పులు వెలువరించారు. మే 14, 1960లో జన్మించిన సంజీవ్ ఖన్నా ఢిల్లీ యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ పూర్తి చేసి.. 1983లో లాయర్ గా ప్రాక్టీస్ ప్రారంభించారు. ఢిల్లీ జిల్లా కోర్టుల్లో ఆయన తన కెరీర్ ప్రారంభించారు. ఆ తరువాత ఢిల్లీ హై కోర్టు, ట్రిబనల్స్ లో వాదించేవారు. సంజీవ్ ఖన్నా ఎక్కువగా రాజ్యాంగ చట్టాలు, డైరెక్ట్ ట్యాక్స్, కంపెనీ లా, భూ చట్టాలు, పర్యవరణ చట్టాలు, బిజినెస్ కార్పొరేట్ తగాదాల్లో ఆర్బిట్రేషన్ లాంటి కేసులు ఆయన వాదించారు.

# హర్యానా సీఎంగా నాయబ్ సింగ్ సైనీ

**ఛండీఘడ్ :** ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బీజేపీ.. ఆ రాష్ట్రంలో మరోసారి అధికారాన్ని చేపట్టి.. చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు ఆ రాష్ట్ర చరిత్రలో ఏ పార్టీకి లేని విధంగా హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసి ముచ్చటగా మూడోసారి కొత్త ప్రభుత్వాన్ని నెలకొల్పింది. ఇక మరోసారి నాయబ్ సింగ్ సైనీ.. హర్యానా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నాయబ్ సింగ్ సైనీతోపాటు మరో 13 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీలు హాజరయ్యారు. వీరితోపాటు దేశంలోని 18 ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు కూడా హాజరయ్యారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఉన్నారు. చండీగఢ్ సమీపంలోని పంచకుల పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో 54 ఏళ్ల నాయబ్ సింగ్ సైనీతో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇక ప్రమాణ స్వీకారానికి ముందు వాల్మీకి ఆలయంలో నాయబ్ సింగ్ సైనీ పూజలు నిర్వహించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఆధ్వర్యంలో హర్యానా అభివృద్ధిలో వేగంగా ముందుకువెళు ్తందని సీఎం చెప్పారు. 1970లో పుట్టిన నాయబ్ సింగ్ సైనీ.. రాజకీయాల్లోకి వచ్చి 3 దశాబ్దాలు అవుతోంది. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నేతృత్వంలో రాజకీయాల్లోకి వచ్చిన సైనీ.. 2014లో నారాయిన్‌గఢ్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత 2016లో మంత్రి పదవి దక్కించుకున్నారు. అప్పటి నుంచి తన రాజకీయ ప్రస్థానం ఒక్కసారిగా పెరిగిపోయింది. ఈ క్రమంలోనే 2019 లోక్‌సభ ఎన్నికల్లో కురుక్షేత్ర నుంచి ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నిర్మల్ సింగ్‌ను భారీ తేడాతో ఓడించారు. ముఖ్యమంత్రితోపాటు మరో 13 మంది ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కాయి. కులసమీకరణాలు అన్నీ పక్కాగా చూసుకుని బీజేపీ మంత్రి పదవుల కేటాయింపు చేసింది. ఇందులో దళితులు, బ్రాహ్మణులు, జాట్ వర్గాల నుంచి ఇద్దరు చొప్పున ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు వచ్చాయి. ఓబీసీ నుంచి నలుగురికి కేబినెట్‌లో చోటు దక్కగా.. రాజ్‌పుత్, పంజాబీ, బనియా వర్గాల నుంచి ఒక్కొక్కరినీ మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కేంద్రమంత్రి రావ్ ఇంద్రజీత్ కుమార్తె ఆర్తీ రావు కూడా సైనీ కేబినెట్‌లో



మంత్రిగా ప్రమాణం చేశారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను పటాపంచలు చేస్తూ.. ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తిరుగులేని విజయాన్ని దక్కించుకుంది. 90 మంది సభ్యులు ఉన్న హర్యానా అసెంబ్లీలో బీజేపీ నుంచి 48 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చిన నాయబ్ సింగ్ సైనీనే మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు అధిష్ఠానంతోపాటు స్థానిక నాయకత్వం మొగ్గు చూపడంతో సీఎం కుర్చీ సైనీకే దక్కింది. బుధవారం జరిగిన బీజేపీ శాసనసభా పక్ష భేటీలో సైనీని ఎన్నుకున్నారు.

**జమ్మూలో ఒమర్ అబ్దుల్లా..**

హరియాణాతోపాటు ఎన్నికలు జరిగిన జమ్మూకశ్మీర్‌లో బుధవారం నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం కొలువుతీరింది. శ్రీనగర్‌లోని షెరి ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కొత్త సీఎంగా ఒమర్ అబ్దుల్లాతో ప్రమాణం చేయించారు. ఉప ముఖ్యమంత్రిగా జమ్మూకు చెందిన సురిందర్ చౌధరి, మరో నలుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక తదితరులు హాజరయ్యారు.

# బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా అరెస్ట్‌కు వారెంట్

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు 45 మందిపై బంగ్లాదేశ్ ఇంటర్నేషన్ క్రైమ్ ట్రైబ్యునల్ గురువారం అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. అరెస్టు వారెంట్లు జారీ అయిన వారిలో అవామీ లీగ్‌కు చెందిన పలువురు నాయకులు సైతం ఉన్నారు. విద్యార్థుల ఉద్యమం నేపథ్యంలో జరిగిన మారణ హోమం, ఇతర నేరారోపణలపై క్రైమ్ ట్రైబ్యునల్‌లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన రెండు పిటిషన్లపై జస్టిస్ మహ్మద్ గోలం ముర్తాజా మజుందార్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని చీఫ్ ప్రాసిక్యూటర్ మహ్మద్ తాజుల్ ఇస్లాం వెల్లడించారు. నవంబర్ 18లోగా షేక్ హసీనా సహా మొత్తం 46 మందిని అరెస్ట్ చేసి హాజరుపరచాలని ధర్మాసనం అధికారులను ఆదేశించింది. బంగ్లా దేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా సాగిన విషయం తెలిసిందే. ఉద్యమాన్ని అణిచివేసేందుకు షేక్ హసీనా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యార్థి నేతలు ఆరోపించారు. హింసాత్మక ఘటనలో వందలాది మంది



ప్రాణాలు కోల్పోయారు. నిరసనలు మరింత ఉధృతం కావడంతో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చారు. ఆమె ప్రస్తుతం భారత్‌లోనే ఆశ్రయం పొందుతున్నారు. హసీనా రాజీనామా తర్వాత నోబెల్ గ్రహీత, ఆర్థిక వేత్త మొహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వం విద్యార్థి ఉద్యమంలో హింసకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నది.

## పౌరసత్వ చట్టంలోని సెక్షన్-ఎ రాజ్యాంగబద్ధమే..

**సమర్థించిన సుప్రీంకోర్టు..**



పౌరసత్వ చట్టం 1955లోని సెక్షన్‌ఏ రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోమిశ్రా ధర్మాసనం 4:1 మెజారిటీతో రాజ్యాంగబద్ధతను సమర్థిస్తూ గురువారం తీర్పును వెలువరించింది. అయితే, న్యాయమూర్తుల్లో జస్టిస్ పార్దివాలా మాత్రమే రాజ్యాంగ విరుద్ధమంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. విదేశీయులను భారత పౌరులుగా గుర్తించినా.. పదేళ్ల వరకు ఓటేసే హక్కు ఉండదన్నారు. బంగ్లాదేశ్ (గతంలో తూర్పు పాకిస్థాన్) నుంచి శరణార్థుల రాక అసోం జనాభా సమతౌల్యతను తీవ్రంగా ప్రభావితం చేసిదంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ రాష్ట్రంలోని అసలైన నివాసితుల రాజకీయ, సాంస్కృతిక హక్కులను ఉల్లంఘించిందని పిటిషన్లు ఆరోపించారు. విచారణ సందర్భంగా సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ అక్రమ వలసలకు అసోం అకార్డ్ రాజకీయ పరిష్కారమని.. సెక్షన్-6ఎ అనేది చట్టబద్ధమైన మార్గమని పేర్కొన్నారు. నిబంధనలు రూపొందించేందుకు మెజార్టీతో కూడిన పార్లమెంట్‌కు ఆ శక్తి ఉందన్నారు.

మానవీయ ఆందోళనలను పరిష్కరించడంతోపాటు స్థానికుల ప్రయోజనాలను కాపాడే సమతౌల్యత సెక్షన్‌కు ఉందని.. ఇందులో కటాఫ్ డేట్‌గా నిర్ణయించిన 1971 మార్చి 25 అనేది సరైనదేనన్నారు. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసిందని. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయాన్ని చెబుతోందని.. ఈ సెక్షన్ అంత ఎక్కువగా జనాభాను కలుపుకోలేదని.. మరీ తక్కువగాను విలీనం చేసుకోలేదని సీజేఐ వ్యాఖ్యానించారు. పౌరసత్వ చట్టం 1955 సెక్షన్6ఎ మేరకు 1966 జనవరి నుంచి 1971 మార్చి 25లోపు అసోంకు వచ్చిన వలసదారులు పౌరసత్వం కోరవచ్చు. ఈ రూల్‌ని 1985లో అసోం అకార్డ్ తర్వాత తీసుకువచ్చారు. అసోంలోకి బంగ్లాదేశ్ వలసలపై ఉద్యమించినవారితో కేంద్రప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ఇది. దీని చట్టబద్ధతపై అసోంలోని కొన్ని స్థానిక గ్రూపులు సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. రాజ్యాంగ పీఠికకు విరుద్ధమని, పౌరహక్కుల ఉల్లంఘనతో పాటు రాజకీయ హక్కులను హరించడమేనని ఆయా గ్రూపులు వాదించాయి.

## 1,200 కోట్ల కుంభకోణం దర్యాప్తులో ఫోర్జరీ..

**ఐపీఎస్ అధికారిణిపై సీబీఐ కేసు**

**ఫోర్జరీ, నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు ఐపీఎస్ అధికారిణిపై ఆరోపణలు**

**ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ పేరుతో వందలాది వ్యక్తులను ఆ సంస్థ మోసం చేసినట్లు ఆరోపణలు**



**ముంబై:** భారీ కుంభకోణం కేసు దర్యాప్తులో ఫోర్జరీ, నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు ఐపీఎస్ అధికారిణిపై ఆరోపణలు వచ్చాయి. సీఐడీ దర్యాప్తులో ఇది బయటపడింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ఆమెపై కేసు నమోదు చేసింది. మహారాష్ట్రలోని జల్గావ్‌లో ఉన్న భైచంద్ హీరాచంద్ రైసోని క్రెడిట్ సొసైటీలో రూ.1,200 కోట్ల కుంభకోణం వెలుగుచూసింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ పేరుతో వందలాది వ్యక్తులను ఆ సంస్థ మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా, 2020 నుంచి 2022 వరకు ఆర్థిక నేర విభాగం డీసీపీగా ఉన్న ఐపీఎస్ అధికారిణి భాగ్యశ్రీ నవ్‌టేక్ ఈ స్కామ్‌పై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు నేతృత్వం వహించారు. అయితే ఒకే రోజు ఒకే నేరం కింద మూడు కేసులు నమోదు చేయడం, ఫిర్యాదుదారులు హాజరుకాకుండానే వారి సంతకాలను ఫోర్జరీ చేయడం, తప్పుడు పత్రాలు సృష్టించడంలో ఆమె ప్రమేయం ఉన్నట్లు సీఐడీ విచారణలో వెల్లడైంది. దీంతో సీఐడీ నివేదిక ఆధారంగా ఈ వ్యవహారంపై కేసు నమోదు చేయాలని పూణె పోలీసులను మహారాష్ట్ర హోంశాఖ ఆదేశించింది.

మరోవైపు 2020లో ఈ కుంభకోణం కేసును సీబీఐకి బదిలీ చేశారు. దీంతో 12 బ్యాంకులను మోసం చేసినందుకు ఢిల్లీకి చెందిన కంపెనీ డైరెక్టర్లపై అవినీతి, చీటింగ్ కేసు నమోదైంది. అలాగే ఈ స్కామ్‌పై దర్యాప్తులో ఫోర్జరీ, తప్పుడు పత్రాలు సృష్టించడం వంటి నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు ఆరోపణలున్న ఐపీఎస్ అధికారిణి భాగ్యశ్రీ నవ్‌టేక్‌పై కేసు నమోదు చేసినట్లు సీబీఐ గురువారం ప్రకటించింది. భారత శిక్షాస్మృతిలోని 120-బీ, 466, 474, 201 సెక్షన్లకు సంబంధించి ఆమెపై అభియోగాలు మోపినట్లు పేర్కొంది.

## మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందా




**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీతోపాటు, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ విస్తరణ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న అన్ని రాష్ట్రాల్లో బరిలో నిలిచి అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఇటీవల జమ్మూ కశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆప్, హరియాణాలో ఖాతా తెరవలేకపోయింది. జమ్మూ కశ్మీర్‌లో ఒక స్థానాన్ని కైవసం చేసుకుంది. అయితే రానున్న కొద్ది రోజుల్లో మహారాష్ట్ర, జార?ండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆప్ ఈ రాష్ట్రాల ఎన్నికల్లో పోటీ చేస్తుందా?

**'ఇండియా'కే మద్దతు..**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జార?ండ్, మహరాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పోటీ చేసే అవకాశం లేదు. రాజకీయ శూన్యత లేని రాష్ట్రాల్లో రెండు, మూడు సీట్ల కోసం ఇతర పార్టీలతో చర్చలు జరపడం వ్యర్థమని పార్టీ సీనియర్ నేతలు భావిస్తున్నారు. మహారాష్ట్రలో ఆప్ క్యాడర్ విస్తరించాలని అనుకుంటోంది. అయితే ఇందుకు కేజ్రీవాల్ సహా పార్టీ అధిష్టానం ఆసక్తి చూపట్లేదు. బదులుగా మహారాష్ట్రలో ఇండియా కూటమి పార్టీలకు మద్దతు తెలపాలని భావిస్తోంది. కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖిగా సాగే ఎన్నికల్లో ఆప్ బరిలో నిలిస్తే.. కాంగ్రెస్సే ఎక్కువగా నష్టపోతోంది. పలు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే విషయం స్పష్టమైంది. దీంతో మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో నేరుగా పోటీ చేసే బదులు ఇండియా కూటమికి మద్దతు పలకాలని ఆప్ భావిస్తోంది. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోయే అవకాశం ఉన్నందున ఓటర్లలో గందరగోళం సృష్టించకూడదనే ఉద్దేశంతో మహారాష్ట్రలో పోటీకి దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించింది. రెండు రాష్ట్రాల్లో పరిస్థితిని అంచనా వేశాకే తాము ఈ నిర్ణయానికి వచ్చామని సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఈ ఏడాది మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే దశలో, జార?ండ్‌లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. జార్ఖండ్‌లో మొదటి దశ పోలింగ్ నవంబర్ 13న, రెండో దశ నవంబర్ 20న జరగనుంది. రెండు రాష్ట్రాల ఫలితాలు నవంబర్ 23న వెల్లడికానున్నాయి.

**2019లో...**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 2019లో కూడా మహారాష్ట్ర, జార?ండ్‌లలో పోటీ చేసింది. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాల్లో 24 స్థానాల్లో బరిలో నిలవగా 23 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయింది. జార్ఖండ్‌లోని 81 స్థానాలకు గానూ ఆ పార్టీ 26 స్థానాల్లో పోటీ చేయగా అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయారు. ఇటీవల జరిగిన హరియాణా ఎన్నికల్లో 90 స్థానాలకుగానూ 89 చోట్ల పోటీ చేసిన ఆప్ కేవలం 1.53 ఓట్ల శాతం మాత్రమే సాధించి డిపాజిట్లు పోగొట్టుకుంది. ఇక్కడ బీజేపీ 48 స్థానాల్లో గెలుపొందగా, కాంగ్రెస్ 35 స్థానాల్లో విజయం సాధించింది.

# మూసీకి పునరుజ్జీవం..

-మొదటిపేజీ తరువాయి

మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలంటే అందుకూ తాము సిద్ధమన్నారు. ప్రజల్ని మెప్పించి, వాళ్ల మనసుల్ని గెలిచేలా ఏం చేద్దామో చెప్పాలని ప్రతిపక్షాల్ని కోరారు. సచివాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. మూసీ నది ఇప్పుడు ఎలా ఉంది!? పునరుజ్జీవం తర్వాత ఎలా ఉండబోతోందన్న అంశాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ మురికి కూపంగా మారడంతో దశాబ్దాలుగా హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలు నరకం చవి చూస్తున్నారని, కొందరు మూసీ గర్భంలో మురికి కూపాల్లో మగ్గుతూ దుర్భరమైన జీవనం సాగిస్తున్నారని, అలాంటి ప్రజలకు మెరుగైన జీవనం అందించాలనే లక్ష్యంతో తాము పునరుజ్జీవానికి పూనుకొంటే అధికారం కోల్పోయిన దుగ్ధతో కొన్ని శక్తులు విష ప్రచారానికి పూనుకుంటున్నాయని మండిపడ్డారు. "450 ఏళ్లకు పైబడిన చరిత్ర ఉన్న చారిత్రక నగరమిది. అన్ని నాగరికతల్లాగే అందమైన మూసీ నదీ తీరంలో ఈ నగరం ఎదిగింది.
ఎంతో ఖ్యాతి సంపాదించింది. గోల్కొండ కోట, చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, ఉస్మానియా ఆసుపత్రి, హైకోర్టు భవనం వంటి చారిత్రక కట్టడాలతో అలరారుతోంది. దీన్ని ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా మార్చవచ్చు. అందుకు మేం పూనుకున్నాం. దీనికి ఎందుకు అడ్డుపడుతున్నారు? మీ బాధేంటి? మీ అభ్యంతరాలేమిటి? మీ అనుమానాలేంటి" అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. చివరకు మీడియా సైతం మౌనంగా ఉంటోందని, తమ ఉద్దేశాన్ని అర్థం చేసుకోవడం లేదని వాపోయారు. "చెప్పండి.. మీకెవ్వరికీ ఇష్టం లేదంటే.. నేను కూడా ఎల్లుండే ఈ ప్రాజెక్టును ఆపేస్తా. టెండర్లు రద్దు చేస్తా" అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌ను ప్రపంచంలో గొప్ప నగరంగా తీర్చిదిద్దడానికి ఇది మంచి అవకాశమని, పర్యాటకం ద్వారానే ఆదాయం పెరుగుతుందని, ఆదాయం లేకపోతే సంక్షేమ పథకాలు అమలుచేయలేమని అన్నారు. అన్నారు.

### అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తా..

మూసీ పునరుజ్జీవానికి తాము చేపట్టే పనుల మీద అనుమానాలున్నా, వివరణలు కావాలన్నా, సూచనలు, సలహాలు ఉన్నా అన్ని పార్టీలు తప్పక చెప్పవచ్చని, దీనిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంతకంటే పెద్ద వేదికైన అసెంబ్లీలోనే చర్చిద్దామని, ఇందుకు నాలుగైదు రోజులపాటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. కిషన్ రెడ్డి, ఈటల వంటి ఎంపీల పరిధిలో మూసీ పరివాహక ప్రాంతం ఉన్నందున వాళ్లను కూడా సభకు ఆహ్వానిస్తామన్నారు. ఈ సమావేశాలకు రావాలని ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్, నాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్‌లకు ఆహ్వానం పలికారు. మూసీ పునరుజ్జీవంపై ప్రతిపక్షాలకు ఎలాంటి అనుమానాలున్నా నోట్ రూపంలో ప్రశ్నావళి పంపితే.. వారి ప్రతి సందేహాన్ని రాతపూర్వకంగా తీరుస్తామని తేల్చి చెప్పారు. ఈనెల 19వ తేదీలోపు అనుమానాలను పంపాలని కేసీఆర్, కిషన్ రెడ్డి, ఒవైసీలతోపాటు కమ్యూనిస్టు పార్టీలకు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు కూడా సలహా సూచనలను రాతపూర్వకంగా ఇవ్వాలని కోరారు. వారి స్పందన ఆధారంగా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తానని, తక్షణం శాసన సభ సమావేశాలు ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఒక్క రోజు వృధా చేసినా నష్టమని, దానివల్ల పేదలకు ఎంతో కష్టమని అన్నారు. విపక్షాలతో సమావేశాలను ఏర్పాటు చేసి ఏకాభిప్రాయం తీసుకురావాలని ఇప్పటికే డిప్యూటీ సీఎంను కోరానన్నారు. దీనిపై మీడియా ఎడిటర్లతోనూ చర్చిస్తామన్నారు. పర్యావరణవేత్తలతో చర్చించేందుకు మంత్రివర్గ ఉప సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు.

### ఇప్పటి వరకూ ఖర్చు 141 కోట్లే!

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు రూ.141 కోట్లు మాత్రమే ఖర్చు చేశామని సీఎం రేవంత్ తెలిపారు. కానీ, కొందరు ఎక్కడి నుంచో లక్షన్నర కోట్ల లెక్కలు తెచ్చారని, బహుశా కాళేశ్వరంలో ఆ పదం వాడి వాడి.. మూసీ విషయంలోనూ అలవాటుగా వాడేస్తున్నారని ఎద్దేవా చేశారు.

### గ్లోబల్ కంపెనీలతో కన్సార్షియం

మూసీ పునరుజ్జీవానికి ప్రపంచంలోని ఐదు కంపెనీల (మెయిన్ హర్డ్ గ్రూప్, రియోస్, కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్, ఝూ, సోమ్)ను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చామని, అన్ని అంశాలను పరిశీలించి ఏడాదిన్నరలో వారు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) ఇస్తారని, ఆ తర్వాతే ఖర్చు తేలుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. "ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టుల్లో పాల్గొన్న ఐదు కంపెనీలను ఎంపిక చేసి, వాటిని ఒక కన్సార్షియంగా ఏర్పాటు చేశాం. ఆరున్నర ఏళ్లపాటు ప్రాజె క్టులో ఇది భాగస్వామిగా ఉంటుంది. ఏడాదిన్నరలో డీపీఆర్ ఇస్తుంది. అందులో పునరుజ్జీవ ప్రణాళిక, నిధుల అంచనా, ఆర్థిక వనరుల కూర్పు, పెట్టుబడుల సేకరణ, లాభనష్టాలు వంటి అంశాలన్నీ పొందుపరుస్తుంది. గ్లోబల్ ఏజెన్సీలతో సంప్రదింపులు, సదస్సులు, సమావేశాల నిర్వహణ తదితర పనులన్నీ చూసుకుంటుంది. ఇందుకే కన్సార్షియానికి రూ.141 కోట్లు కేటాయించాం. అంతకుమించి ఐదు పైసలు కూడా అదనంగా ఖర్చు చేయలేదు" అని వివరించారు. కన్సార్షియంలో ఉన్న కంపెనీలకు స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ (సర్దార్ వల్లభాయ్ పటేల్), సమతామూర్తి (ముచ్చింతల్) విగ్రహాలు నిర్మించిన అనుభవం ఉందని, బుర్జ్ ఖలీఫా నిర్మాణంలో భాగమైన సంస్థ కూడా భాగస్వామి అని చెప్పారు. కానీ, పాకిస్థాన్‌కు చెందిన కంపెనీ అంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం కొందరు చేస్తున్నారని మండిపడ్డారు.

### మూసీలో 3 నెలలు ఉండండి, అద్దె నేను కడతా

మూసీ ప్రక్షాళన ద్వారా ప్రజలకు మెరుగైన జీవితం అందించాలని తాము చూస్తుంటే కొందరు విష ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. "యూట్యూబ్‌లు పెట్టి విష ప్రచారం చేస్తే చాలు అధికారంలోకి వస్తామని ఒకాయనకు ఎవరో చెప్పారట. దాంతో మెదడంతా విషం నింపుకొని సుందరీకరణ అంటూ ప్రచారం చేస్తున్నారు. అధికారం కోల్పోయిన అసహనంతో మాట్లాడుతున్నారు. మేం చేస్తున్నది దుబాయ్‌లో నెత్తి మీద జుట్టు నాట్లేయించుకునే సుందరీకరణ కాదు. మూసీలో ఒక్క ఇంటిని కూడా కూల్చనీయమని, బుల్డోజర్లకు అడ్డం పడతమని కొందరు లీడర్లు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. అదే మూసీ రివర్ బెడ్‌లోని ఇళ్లలో నివాసం ఉండాలని వాళ్లను నేను కోరుతున్నాను. కేటీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌కు సవాల్ విసురుతున్నా. నిర్వాసితులు ఖాళీ చేసి పోయిన ఇళ్లు రెడీగా ఉన్నాయి. వాటిలో ఓ మూడు నెలలు ఉండండి. రెంట్ నేను కడతా. మీకు ఫుడ్ కూడా ఏర్పాటు చేస్తా. మీరు ఉండి మంచిగుందంటే అప్పుడు పేదలు కూడా వచ్చి ఉంటారు. అప్పుడు తేలుద్దాం" అంటూ సీఎం రేవంత్ సవాల్ విసిరారు. అక్కడ బాగుందని అప్పుడు వాళ్లు చెబితే ప్రాజెక్టును రద్దు చేస్తానని, ఇప్పటి వరకు అయిన ఖర్చును తానే భరిస్తానని అన్నారు.

### అందరికీ నచ్చిన రీతిలో ప్యాకేజీ

మూసీలో ఇప్పటి వరకు ఒక్క ఇంటిని కూడా ప్రభుత్వం బలవంతంగా కూల్చలేదని, డబుల్ బెడ్‌రూం ఇల్లు తీసుకుని వెళ్లిన లబ్ధిదారులే స్వచ్ఛందంగా వాటిని ఖాళీ చేయడమే కాకుండా ఆ ఇళ్లను కూలగొట్టారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటి వరకూ ఒక్క ఇటుకను కూడా ప్రభుత్వం తీయలేదని, హైడ్రా అటువైపు కన్నెత్తి చూడలేదని వివరించారు. రివర్ బెడ్‌లో 1600, బఫర్ జోన్‌లో మరో 10 వేల ఇళ్లు ఉన్నాయి. అందరికీ నచ్చిన రీతిలో ప్యాకేజీ మాట్లాడి మెరుగైన జీవనం కల్పిస్తాం. పేదలకు కలిగే నష్టం, కష్టాన్ని పరిగణనలోకి తీసుకుని, వారిని అక్కున చేర్చుకుని అన్ని విధాలుగా ఆదుకుంటాం. శాశ్వత నిర్మాణాలు ఉన్న వారిలో ఎవరు ఎంత నష్టపోతున్నారనే దానిని అంచనా వేసి, వారిని సంప్రదించి, వివరాలను సేకరించి ఆ స్థాయిలోనే న్యాయం చేస్తాం. ఈ విషయంలో ప్రభుత్వం విచక్షణతో ఉంది. ఆదుకోవాలనే తాపత్రయం ఉంది" అని వివరించారు. మూసీ పునరుజ్జీవానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ క్రమంలో పేదలను ఆదుకోవడానికి సంప్రదింపులే మార్గమని, వాటిని ఎలా మొదలు పెట్టాలనే కార్యాచరణను ప్రతిపక్షాలైన బీఆర్‌ఎస్, బీజేపీ, మజ్లిసతోపాటు మీడియా కూడా ఇవ్వాలని కోరారు. మూసీ పునరుజ్జీవంలో నష్టపోయేవారికి ఏ సాయం అందించాలనే దానిపై మీడియా కూడా నిజనిర్ధారణ కమిటీ వేసి, రిపోర్టు ఇచ్చినా స్వీకరిస్తామని అన్నారు. దీనిపై అపోహలు, అనవసరమైన వాదనలతో మరో విషయాన్ని ముడిపెట్టి గందరగోళానికి తెర లేపవద్దని విజ్ఞప్తి చేశారు. హైడ్రా పేరుతో భయపెడితే బెదరవద్దని, హైడ్రా దయ్యమో, ఫామ్‌హౌజ్‌లో పడుకున్న భూతమో కాదని చమత్కరించారు. అక్కడ ఆస్తులు, ఇళ్లు కోల్పోతున్న వారిలో కొంతమంది కోర్టుకెళ్లారని విలేకరులు ప్రస్తావించగా.. కోర్టుకెళ్లినా, వెళ్లకపోయినా.. వారు నష్టపోతున్న దాన్ని అంచనా వేసి, ఏవిధంగా ఆదుకోవాలన్న దానిపైనే కార్యాచరణ ఇవ్వాలని కోరుతున్నానని స్పష్టం చేశారు. గతంలో హైదరాబాద్‌లో వరదలు వచ్చినప్పుడు నష్టపోయిన వారికి రూ.10 వేలు పరిహారం ఇస్తామని ప్రకటించారని, అందులో పెద్ద స్కామ్ జరిగిందని, దానిపై విచారణకు సిద్ధమా అని బీఆర్‌ఎసకు సీఎంరేవంత్ సవాల్ విసిరారు. సిద్ధమని అంటే.. 48 గంటల్లోనే ఏసీబీకి ఆదేశాలు ఇస్తానని వ్యాఖ్యానించారు. కాగా బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడే మూసీ పునరుజ్జీవన కార్యక్రమం చేపట్టాలని కేసీఆర్ భావించారని, కానీ, మానవీయ కోణంలో ఆలోచించే ఆయన చేయలేదని బీఆర్‌ఎస్ నేతలు అంటున్నారని విలేకరులు చెప్పగా.. వాళ్ల మానవత్వం, మానవీయ కోణం మల్లన్నసాగర్, ఏటిగడ్డ కిష్టాపూర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులు నిర్మించిన ప్రాంతాలకు వెళ్తే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. ఏ విషయంలోనూ బీఆర్‌ఎసతో తమకు పోలిక లేదని, ఒక మనిషి, ప్రభుత్వం ఎలా ఉండకూడదో, తక్కువ టైమ్‌లో ఎక్కువ దోపిడీ ఎలా చేస్తారనే దానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రోల్‌మోడల్ అని వ్యాఖ్యానించారు. వాళ్లు చేసినట్టు తాను చేయకపోతే తెలంగాణకు వెయ్యి రెట్లు మేలు చేసిన వాడినవుతానని అన్నారు.

# ప్రశ్నించడం బంద్ అయితే.. తెలంగాణ మూగబోతది

-మొదటిపేజీ తరువాయి

అతిపెద్ద బిల్డింగ్ కట్టాను.. కానీ 8 ఏండ్లలో మున్సిపల్ మంత్రిగా ఉన్న మిమ్మల్ని కలిసే అవసరం రాలేదు. కానీ ఇప్పుడు మొదటిసారి కలుస్తున్నాను. అప్పుడు కేసీఆర్ భయంతో అధికారులు పని చేసేవారు.. మంత్రులను కలిసే పరిస్థితి రాలేదు. కానీ ఇప్పుడు కరెంట్ కనెక్షన్ కోసం ఫోన్ చేసినందుకు రూ. 25 లక్షలు తీసుకున్నారట. ఈ విషయాన్ని సదరు బిల్డర్ చెప్పి బాధపడినట్లు కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ నేతలు అందినకాడికి దోచుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. గత పది నెలల్లో అత్యంత కష్టకాలాన్ని ఎదుర్కొన్నాం. ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ప్రతిపక్షంలో కూర్చుంటామని ఊహించలేదు. డిసెంబర్ 7న కేసీఆర్‌కు ప్రమాదం జరగడం.. మూడు నెలల పాటు ఇబ్బందికి గురయ్యారు. ఓ పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలతో దొంగల్లో కలిసిపోయారు. మన ఆడబిడ్డ కవితమ్మను ఐదున్నర నెలలు జైల్లో పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో కొట్లాడినం, పోరాడినం కానీ ఎవరికీ లొంగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించిన దానికి భిన్నంగా ఫలితాలు వచ్చాయి. ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, బతుకమ్మ చీరలు వస్తుండే అని అనుకుంటున్నారు. కులమతాలకు అతీతంగా కేసీఆర్‌ను తలచుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు.

### బీఆర్‌ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక : కేటీఆర్

బీఆర్‌ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక అని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష.. కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ. ఈ పార్టీ మరో 75 ఏండ్ల పాటు ఒక డీఎంకే లాగా, శిరోమణి అకాలీదళ్ లాగా ఉంటది. ఈ పార్టీ మన తెలంగాణ ప్రజలది అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్వీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మనం జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్‌నే శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. తెలంగాణ సమాజానికి మరింత డేంజరస్ పార్టీ బీజేపీనే. మతాలను అడ్డంపెట్టుకుని, మతపరమైన రాజకీయాలు చేస్తూ.. దేవుడిని అడ్డుపెంట్టుకుని పిల్లలను రెచ్చగొడుతున్నారు. తెలంగాణకు



చేసిందేమీ లేదు బీజేపీ. ఐఐటీ, ఐఐఎం, మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదు. ఆఖరికి ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదు. తెలంగాణకు ఏం ఇచ్చారని అడిగితే ఎవరు చెప్పరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మాటలు రావు. కానీ పిల్లలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 32 జిల్లాల్లో పార్టీ ఆఫీసులు ఉన్నాయి. ప్రతి జిల్లాలో బీఆర్‌ఎస్వీ సమావేశాలు జరగాలి. మండలం, నియోజకవర్గం స్థాయిలో కమిటీలు వేసుకుందాం. సమర్థవంతమైన విద్యార్థి నాయకులు ఉన్నారు. వారిని జిల్లాలకు పంపుదాం. మండల కమిటీ, కాలేజీ కమిటీలను భర్తీ చేసి కొత్త నాయకత్వాన్ని ఎంకరేజ్ చేసుకుందాం. ఎక్కడికక్కడ సోషల్ మీడియాలో క్రియాశీలక పాత్ర పోషించాలి. కేసులకు భయపడొద్దు.. లీగల్ సెల్‌ను బలోపేతం చేస్తున్నాం. విద్యార్థి నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. బీఆర్‌ఎస్వీ లేని కాలేజీ ఉండొద్దు. విద్యార్థి నాయకులకు రాజకీయంగా అవకాశాలు ఇస్తాం. మున్సిపల్ చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు ఇతర పదవుల్లో అవకాశాలు కల్పిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

### చిట్టి నాయుడి పాలనలో ప్రతి ఒక్కరికి బాధలే.. నిప్పులు చెరిగిన కేటీఆర్

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన చిట్టి నాయుడి పాలనలో ప్రతి ఒక్కరి బాధ పడుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలు జరుగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్వీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఎన్నో ప్రాణత్యాగాలతో ఏర్పడ్డ రాష్ట్రం ఇది. మీ త్యాగాలతో పునీతమైన నేల ఈ తెలంగాణ నేల. ఈ పదేండ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో పని చేశాం. నీళ్లల్లో సంపూర్ణమైన విజయం సాధించాం. కాళేశ్వరం వంద శాతం పూర్తయింది. పాలమూరు – రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులు 95 శాతం పూర్తయ్యాయి. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు ఇచ్చి దశాబ్దాల తాగునీటి గోసను సమూలంగా తుడిచిపెట్టాం అని కేటీఆర్ తెలిపారు.

### ఎవరికి ఏ కష్టం వచ్చినా తెలంగాణ భవన్‌కే..

నిధుల విషయానికి వస్తే.. 2014లో తలసరి ఆదాయంలో తెలంగాణ 14వ స్థానంలో ఉండే. గతేడాది కేసీఆర్ దిగిపోయే నాటికి తలసరి ఆదాయంలో నంబర్ వన్ స్థానానికి ఎదిగాం. అన్ని వర్గాల కుటుంబాల్లో ఒక ఆర్థిక భరోసా నింపామని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తెలంగాణ భవన్‌కు వస్తున్నారు.. 10 జిల్లాల నుంచి ఆశా కార్యకర్తలు వచ్చి తమ బాధలు చెప్పుకున్నారు. మా జీతం రూ. 1500 ఉంటే.. అడగకముందే రూ. 9900 చేసిన మహానుభావుడు కేసీఆర్ అని ఆశా కార్యకర్తలు తెలుపుతున్నారు. మాకు ఆశ పెట్టి మోసం చేశారని ఆవేదన చెందారు. 9 వేలు ఏంది.. 18 వేలు ఇస్తామని చెప్పి పత్తా లేకుండా పోయారు. మా కోసం మాట్లాడండి అని కోరారు. సందర్భానుసారంగా సమావేశాలు నిర్వహించి చిట్టి నాయుడిని వణికించి, న్యాయం చేస్తామని ఆశా కార్యకర్తలకు భరోసా ఇచ్చినట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

### 95 శాతం రిజర్వేషన్లకు తూట్లు..

గ్రూప్–1 వాయిదా కోసం అశోక్ నగర్‌లో నిన్న రాత్రి అభ్యర్థులు రోడ్డెక్కారు. రిజర్వేషన్ల అమలు విషయంలో అన్యాయం జరుగుతుంది. 95 శాతం రిజర్వేషన్లకు తూట్లు పొడుతున్నారు. మాకు ఉద్యోగాలు రాకుండా చిట్టి నాయుడు మోసం చేస్తున్నారని అభ్యర్థులు ఆరోపించారు. 60 శాతం రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కల్పించేవారు. మిగతా 40 శాతం ఓపెన్ కోటాలో జనరల్ కేటగిరిలో కూడా మెరిట్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించేవారు. కానీ ఇవాళ దాన్ని కూడా తుంగలో తొక్కారు. జీవో 55ను రద్దు చేసి జీవో 29ని అమలు చేస్తున్నారు. పరీక్ష రాసేందుకు మాకు అభ్యంతరం లేదు. 3 లక్షల మందిలో 30 వేల మందికి మేం క్వాలిఫై అయ్యాం.. కానీ పరీక్ష రాసిన తర్వాత.. కాంగ్రెస్ ప్రభుత్వం లోపభూయిష్ట ఉత్తర్వులు తప్పని పరీక్షలను రద్దు చేస్తే మళ్లీ రాయాల్సిన పరిస్థితి వస్తదని గ్రూప్–1 అభ్యర్థులు అంటున్నారు.

## ఏపీలో రిపోర్టు చేసిన నలుగురు ఐఏఎస్ అధికారులు

రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీకి కేటాయించినప్పటికీ, తెలంగాణలోనే విధులు నిర్వర్తిస్తున్న ఐఏఎస్ అధికారులు... డీవోపీటీ ఆదేశాల నేపథ్యంలో ఎట్టకేలకు నేడు ఏపీలో రిపోర్టు చేశారు. ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి కాటా, రొనాల్డ్ రాస్, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్ ఏపీ సీఎస్ కు రిపోర్టు చేశారు. ఈ నలుగురు ఐఏఎస్ అధికారులు తెలంగాణలోనే కొనసాగేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. క్యాట్ ను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. తెలంగాణ హైకోర్టులోనూ వారికి చుక్కెదురైంది. దాంతో డీవోపీటీ ఆదేశాలను పాటించక తప్పలేదు. ఈ క్రమంలో నలుగురు ఐఏఎస్ అధికారులు నిన్న సాయంత్రం తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యారు.

## మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధం కావాలి

-మొదటిపేజీ తరువాయి

అమలు చేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండా పోయింది. తేనే పూసిన కత్తిలా ఆయన మాటలు ఉంటాయి. ప్రజలను నమ్మించడంలో ఘనుడే.. మోసం చేయడంలో అంతకంటే ఘనుడు. మాదిగల పట్ల ఆయన మాటలు తేనే పూసినట్టు ఉంటాయి. కానీ అవి మాకు తీపిని అందించవు. మాకు చేదుగానే, మోసంగానే ఉంటాయని మందకృష్ణ తెలిపారు. పరీక్షల నిర్వహణ కానీ అన్ని నోటిఫికేషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని రేవంత్ రెడ్డి శాసనసభా వేదికగా చెప్పాడు. దీన్ని కూడా ఆయన విస్మరించాడు. ఇవాళ మాదిగల పొట్ట కొట్టింది రేవంత్ ప్రభుత్వం. 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసి అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించారు. ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే అంతకుముందున్న నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణ అమలు చేస్తామన్న రేవంత్.. అది అమలు చేయకుండానే నియామక పత్రాలు అందజేశారు. ఇంది మాదిగ బిడ్డల పొట్ట కొట్టినట్టు కాదా..? అని రేవంత్ రెడ్డిని మందకృష్ణ మాదిగ నిలదీశారు.

## గ్రూప్-1 పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి

-మొదటిపేజీ తరువాయి

ఎండీ ముష్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు సీఎస్ శాంతి కుమారి. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు జరుగుతుండడంతో.. పరీక్షల నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుతో కూడుకుంటున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏవిధమైన అపోహలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మహేందర్ రెడ్డి సూచించారు.

## 23న తెలంగాణ కేబినెట్

-మొదటిపేజీ తరువాయి

సాయంత్రం 4 గంటలకు కేబినెట్ భేటీ జరుగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ప్రకటన జారీ చేశారు. మంత్రివర్గ సమావేశంలో కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉంది. హైడ్రాకు చట్టబద్ధతతో పాటు అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చించనున్నారు. జీహెచ్ఎంసీ అధికారాలు ఇటీవలనే హైడ్రాకు కట్టబెడుతూ పురపాలకశాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ యాక్ట్ చట్ట సవరణ బిల్లుపై కేబినెట్ లో చర్చించే అవకాశం ఉంది. ఇక వచ్చే అసెంబ్లీ సమావేశాల నిర్వహణతో పాటు చర్చించే అంశాలపై కూడా సమాలోచనలు చేయనున్నారు. ఇవే కాకుండా ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులతో పాటు కుల గణన వంటి అంశాలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది..!మరోవైపు తెలంగాణ ప్రభుత్వం మూసీ ప్రక్షాళలను సీరియస్ గా తీసుకుంది. పరివాహన ప్రాంతంలో ఉన్న నిర్వాసితులకు ఇళ్లను కేటాయించే పనిలో పడింది. ఇప్పటికే చాలా ఇళ్లకు మార్కింగ్ కూడా చేసింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుగా మూసీ సుందరీకరణను తీసుకుంది. ఈ నేపథ్యంలో కేబినెట్ భేటీలో ఈ విషయంపై లోతుగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇక రాష్ట్రంలో చాలా మంది రైతులు పంట పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇందుకోసం తీసుకొచ్చిన రైతు భరోసా స్కీమ్ పై కేబినెట్ చర్చించనుంది. విధివిధానాలను ఖరారు చేసే అంశంపై సమాలోచనలు చేయనుంది. ఇక రుణమాఫీ స్కీమ్ కూడా చర్చకు రానుంది. ఈ నెలాఖారులోపు మిగిలిపోయిన రైతులకు కూడా రుణమాఫీ స్కీమ్ వర్తింపజేస్తామని ప్రభుత్వం చెబుతోంది. దీనిపై కూడా కీలకంగా చర్చించే అవకాశం ఉంది.

## పెరగనున్న మద్యం ధరలు..

**హైదరాబాద్:** తెలంగాణలో మద్యం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తోంది. ఈ ఏడాది కూడా మద్యం ద్వారా భారీగా ఆదాయం ఆర్జించాలని తెలంగాణ సర్కార్ భావిస్తోంది. అందులో భాగంగానే మద్యం ధరల పెంపునకు సిద్ధమైనట్లు సమాచారం. సాధారణంగా బీర్ల ఉత్పత్తి కేంద్రాలకు చెల్లించే ధరలను ప్రభుత్వం ప్రతి రెండేళ్లకొకసారి పెంచుతుంది. అలాగే ఈసారి వివిధ రకాల మద్యంపై రూ. 20 నుంచి రూ. 150 పెంచాలని ప్రభుత్వాన్ని బ్రూవరీలు కోరాయి. ఏటా బతుకమ్మ, దసరా సందర్భంగా రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఈసారి కూడా మందుబాబులు అదే ఒరవడిని కొనసాగిస్తూ భారీ రికార్డు నెలకొల్పారు. కేవలం 10 రోజుల వ్యవధిలో రూ.1,100 కోట్లకుపైగా మందును తాగేశారు. పది రోజుల్లో వెయ్యి కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. బార్లు, మద్యం దుకాణాలతో పాటుగా పబ్‌లలోనూ అమ్మకాలు పెరిగాయి. దీంతో సర్కార్ ఖజానాకు.. మద్యం భారీగా ఆదాయం తెచ్చి పెట్టింది. మద్యం అమ్మకాల్లో ఎప్పటిలాగే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది.

### 17 లక్షల బీర్లు..

రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. వీటితో పాటుగా పబ్బుల్లోనూ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఏటా దసరా వేళ తెలంగాణలో మద్యం ఎక్కువ మొత్తంలో అమ్ముడవుతుంది. ఈ సారి అదే అంచనాతో ముందుగానే ఎక్సైజ్ శాఖ అధికంగా మద్యం నిల్వలను సిద్ధం చేసుకుంది. ఆర్డర్లు కూడా ఊహించిన దాని కన్నా అధికంగా ఉండటంతో రాష్ట్ర సర్కార్ ఖజానాకు కాసుల వర్షం కురిసింది. బార్లు సైతం తగినంత స్టాక్‌ను అందుబాటులో ఉంచాయి. దసరాకు ముందు నుంచే మొదలైన మద్యం కిక్కు శని, ఆదివారాల్లో పీక్స్‌కు చేరింది. సెప్టెంబర్ 30 వరకు 2 వేల 838 కోట్ల అమ్మకాలు జరగ్గా... అక్టోబర్ నెల ప్రారంభం నుంచి 11వ తేదీ వరకు రూ 1,100 కోట్ల మేర విలువైన 10 లక్షల 44వేల కేసుల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. 10 రోజులవ్యవధిలోనే 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయాయట. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డి టాప్‌లో ఉండగా ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, వరంగల్ జిల్లాలు తర్వాతి మూడు స్థానాల్లో ఉన్నాయి.

### స్వల్పంగా తగ్గిన ఆదాయం..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మద్యం అమ్మకాలు ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూర్చాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 10వ తేదీతో పోలిస్తే ఈ ఏడాది ఇదే సమయంలో పది రోజులకుగానూ అమ్మకాలు కాస్త తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్, సరూర్‌నగర్, వికారాబాద్ జిల్లాల పరిధిలో 674 మద్యం దుకాణాలు ఉండగా, 2023లో మద్యం అమ్మకాల ద్వారా రూ.317 కోట్ల 21 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రూ.312 కోట్లే ఖజానాకు వచ్చింది. గతంతో పోల్చితే ఎక్సైజ్ ఆదాయం రూ.5 కోట్ల 18 లక్షలు తగ్గడం గమనార్హం. బడ్జెట్ ప్రవేశ పెట్టగా వ్యవసాయానికి ఎక్కువ ప్రియారిటీ ఇచ్చారు. అయితే బడ్జెట్ సమావేశాల తర్వాత తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకోబోతున్నట్టు తెలుస్తుంది..

# ముదురుతున్న గ్రూప్ 1 వివాదం

**హైదరాబాద్ :** తెలంగాణలో గ్రూప్ – 1 మెయిన్స్ పరీక్షల వివాదం ముదురుతోంది. మెయిన్స్ వాయిదా వేయాలంటూ అభ్యర్థుల ఆందోళనతో నగరంలో వాతావరణం హీటెక్కింది. అటు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కీలక నేతలతో అభ్యర్థులతో భేటీ కావడంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. గాంధీ భవన్‌లో గ్రూప్ – 1 అభ్యర్థులతో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ గురువారం మధ్యాహ్నం భేటీ అయ్యారు. వారి డిమాండ్లను సావధానంగా విన్నారు. జీవో 29 రద్దు చేసి పరీక్షలు నిర్వహించాలని.. పాత జీవో 55 ప్రకారం పరీక్షలు జరగాలన్నారు. పాత నోటిఫికేషన్‌లో ఇచ్చిన 503 పోస్టుల్లో కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వొద్దన్నారు. పెంచిన 60 పోస్టుల్లో మాత్రమే కొత్తగా అప్లై చేసుకున్న వారికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. పాత నోటిఫికేషన్ ప్రకారమే రిజర్వేషన్లు, ఓపెన్ క్యాటగిరీ ప్రకారం పరీక్షలు ఉండాలని.. రిజర్వేషన్ అంశాల్లో కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. దీనిపై స్పందించిన మహేశ్ కుమార్ గౌడ్.. ఈ డిమాండ్లపై ప్రభుత్వానికి సమాచారం ఇస్తామని.. సాయంత్రంలోపు క్లారిటీ ఇస్తామని స్పష్టం చేశారు.మరోవైపు, బీఆర్ఎస్ హయాంలో మీరు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేస్తారా.? అంటూ కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. నిరుద్యోగుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే డీఎస్సీ, వైద్యారోగ్య శాఖలో ఉద్యోగాలు, గ్రూప్స్, పోలీస్ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఏడున్నర లక్షల కోట్ల అప్పులు చేసి మిగులు రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**'అభ్యర్థులకు అండగా ఉంటాం'**

అటు, తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోనూ గ్రూప్ – 1 అభ్యర్థులు భేటీ అయ్యారు. జీవో నెంబర్ 29 ఎత్తివేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని..




మెయిన్స్ వాయిదా వేసేలా చూడాలని కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. అభ్యర్థులకు తప్పకుండా సహకరిస్తామని.. ఒకవేళ సుప్రీంకోర్టుకు వెళ్తే పార్టీ తరఫున అండగా ఉంటామని స్పష్టం చేశారు. కాగా, గ్రూప్ 1 మెయిన్స్ రీషెడ్యూల్ చేయాలని అభ్యర్థులు గత కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగారు. గ్రూప్ – 1 ప్రిలిమ్స్ పరీక్షపై దాదాపు 33 కేసులు వచ్చాయని.. వాటన్నింటినీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులంతా ఒక్కసారిగా దూసుకురావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు అభ్యర్థులను అరెస్ట్ చేసి వివిధ స్టేషన్లకు తరలించారు.

**మెయిన్స్ నిర్వహణపై సీఎస్ సమీక్ష**

అయితే, ఈ వివాదం కొనసాగుతుండగానే ఈ నెల 21 నుంచి షెడ్యూల్ ప్రకారం మెయిన్స్ నిర్వహణకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 14న టీజీపీఎస్సీ హాల్ టికెట్లను విడుదల చేసింది. ఈ క్రమంలోనే గ్రూప్ – 1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు.

# వివాదాల్లో కొండా సురేఖ

**హైదరాబాద్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీసీ సామాజిక వర్గం చెందిన మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ పొలిటికల్ సర్క్యూట్స్ లో హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి ట్రోల్ చేశారని, దాని వెనక ఆ పార్టీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఉన్నారంటూ.. ఆరోపిస్తూ చేసిన వ్యాఖ్యలతో పొలిటికల్ కాంట్రవర్సీ అయింది. సినిమా సెలబ్రిటీలతో కేటీఆర్‌కు లింక్స్ అంటూ చేసిన కామెంట్స్ సంచలనం రేపాయి అప్పటి నుండి కొండా సురేఖ వార్తల్లో ఉంటున్నారు.సినీ నటులు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత నుండి మొదలైన మంత్రి కొండా సురేఖ కాంట్రవర్సీ.. ప్రస్తుతం సొంత జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫ్లెక్సీ వివాదంతో ప్రత్యక్ష ఫిర్యాదుల దాకా వెళ్లింది. ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. తమ తమ నియోజిక వర్గాల్లో జరిగే వ్యవహారాల్లో ఉద్దేశపూర్వకంగా కలగచేసుకుని తమకు స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారని పలువు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీకి ఫిర్యాదు చేయడంతో రాజకీయంగా చర్చకు



దారితీస్తోంది. ఫిర్యాదు చేసినవారిలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య ఉన్నట్లు తెలిస్తోంది. ప్రోటోకాల్ ప్రభుత్వ కార్యకలాపాలు వ్యక్తిగత వ్యవహారాల్లో మంత్రి కొండా సురేఖ జోక్యం చేసుకోవడం నచ్చడం లేదని సదరు నాయకులు ఆరోపిస్తున్నారు.ఏఐసీసీ తెలంగాణ చీఫ్‌తోపాటు టీపీసీసీకి ఫిర్యాదు చేయడమే కాకుండా ఢిల్లీ హై కమాండ్ వరకు కొండా సురేఖ వివాదం వెళ్లిందంటూ ప్రచారం సాగుతోంది. మంత్రి కొండా సురేఖ విషయం లో మాట్లాడాలంటూ ఏఐసీసీ కార్యదర్శి ఐఅ వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ వరంగల్ ఎమ్మెల్యేలు కోరినట్లు తెలుస్తోంది. అయితే, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీప్‌దాసు మున్షీ.. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ హామీతో ఎమ్మెల్యేలు ఢిల్లీ టూర్ ప్రస్తుతం వాయిదా వేసుకున్నట్లు సమాచారం. సమస్య పరిష్కారం చేస్తాం.. పరిష్కారం కాకపోతే అప్పుడు ఢిల్లీకి వెళ్ళండి అని సర్దిచెప్పడంతో ఢిల్లీ వెళ్లడం వాయిదా వేసుకున్నట్లు తెలిసింది.మరో వైపు బీసీ మహిళా నేతగా మంత్రిగా ఉన్న తనను కావాలనే బద్నాం చేస్తున్నారని కొండా సురేఖ ఆరోపిస్తున్నారు. కేటీఆర్ తనపై విషప్రచారం చేసిన సమయంలో తాను చేసిన కామెంట్స్ పై సైతం కుట్రలో భాగంగానే రాద్ధాంతం చేశారని విమర్శిస్తున్నారు. మరి.. కొండా సురేఖ ఎపిసోడ్‌కు తెలంగాణ కాంగ్రెస్ ఎలా ఫుల్‌స్టాప్ పెడుతుందో చూడాలి..!

## ఇషా ఫౌండేషన్‌లో చిన్నారులపై వేధింపులు

**హైదరాబాద్ :** అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఇషా ఫౌండేషన్ ఆధ్యాత్మికత ముసుగులో చిన్నారులపై వేధింపులకు పాల్పడే వారి పెంపకానికి కేంద్రంగా నిలుస్తుంది అని మాజీ అధ్యాపకులు యామిని రాగానే తెలిపారు. హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లు లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.... ఆశ్రమ నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉష ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు.. విష విద్య ఇషా ఉష సంస్కృతి ఇషా నిషా హోమ్ స్కూల్లో 8,000 మంది పైగా విద్యార్థులు న్నారని తెలిపారు. ఉషా సెంటర్లో విద్యా కార్యక్రమాల పేరుతో ఇషా సంస్కృతికి చెందిన బాలికలను అత్యధిక దీక్షలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో ఎనిమిదేళ్ల బాలికపై పలుమార్లు అత్యాచారం జరిగినప్పుడు బయటకు రాకుండా మౌనం వహించారని వారు తెలిపారు. ఉష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు తాను సాక్షాతపరమైన ఆత్మ అని మరియు కరుణతో నిండి ఉన్నాడని ఇషా సంస్కృతి మరియు ఇషా విద్యార్థు లపై జరుగుతున్న ఆకృత్యాలపై ఎప్పుడు నోరు విప్పడం లేదని తెలిపారు. 12వ తరగతి చదువుతున్న ఆలైడీ మరణం యజమానియం నిర్లక్ష్యం వల్లే జరిగిం దని వివరించారు. ఇషా ఫౌండేషన్ ఇషా ఎడ్యుకేషన్ చేస్తున్న ఈ దురాగతాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## ఉపా చట్టం రద్దు చేయాలి

**హైదరాబాద్ :** ఉపా చట్టాన్ని రద్దు చేసి బేషరతుగా రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని ప్రొఫెసర్ హర గోపాల్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేసారు. హైదారాబాద్ సిపిఐ ఆధ్వర్యంలో హైదారాబాద్ ఇందిరా పార్క్ వద్ద నల్ల దుస్తులను ధరించి నిరసన దీక్షకు దిగారు. ప్రొఫెసర్ హర గోపాల్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకులపై విచారణ లేకుండా ట్రైయల్లో మగ్గుతున్న ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. సాయిబాబా లాంటి వ్యక్తులను అత్యంత క్రూరమైన ఉపా చట్టనీ కింద అరెస్టు చేసి చివరివర కూ అక్కడే ఉంచుకోవడం ఎంతవరకు సమంజసం .

# విద్యార్థినుల పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు

**వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురిపై కేసు నమోదు..?**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**రాజన్న సిరిసిల్ల :** విద్యార్థినుల పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లతో వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వేదికగా మహిళల విద్యార్థినుల పట్ల వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే నిర్భయంగా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో ఫెక్ ఐడి లతో ఇన్‌స్టాగ్రామ్ ఫేస్ బుక్, అకౌంట్ లు క్రియేట్ చేసి,లేదా మహిళల సోషల్ మీడియా అకౌంట్స్ ని హ్యాక్ చేసి అసభ్యకర వీడియోలు, ఫోటోస్ పంపుతూ మహిళలు, విద్యార్థినుల వేధింపులు గురి అవుతున్న పిర్యాదులు ఎక్కవ వస్తున్నాయని, అలాంటి వేధింపులకు పాల్పడే పోకిరిల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, సోషల్ మీడియా వేదికగా ఆడపిల్లలను, మహిళలను వేధించినా, అసభ్యంకర ఫొటోలు, వీడియోలు పంపిన, సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టు చేసినా, మిత్రులకు షేర్ చేసినా తీవ్రమైన నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇలాంటి స్సమస్యలపై జిల్లా పోలీస్ నిఘా ఉంటుందని ఇలాంటి సమస్యలపై



మహిళలు, విద్యార్థినులు నిర్భయంగా జిల్లా షీ టీమ్ కి పిర్యాదు చేయాలని తెలిపారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థినుల పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేసి లేదా వారి అకౌంట్ హ్యాక్ చేసి వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురు పోకిరీలపై కేసు నమోదు చేయడం జరిగిందని,సోషల్ మీడియా వేదికగా కానీ,పని చేసే ప్రదేశాల్లో కానీ, పాఠశాలలో, కళాశాలల్లో మహిళలను , విద్యార్థినులకు వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని, మహిళలు విద్యార్థినులు వేధింపులకు గురైనట్లయితే వెంటనే డయల్ 100, లేదా షీ టీం నెంబర్ 87126 56425 కి పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అని తెలిపారు.

# ఐటీఐ లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**భూపాలపల్లి :** తెలంగాణ ప్రభుత్వ ఉపాధి మరియు శిక్షణ శాఖ ప్రభుత్వ ఐటిఐ, భూపాలపల్లి నందు కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్లో గురువారం ప్రాంతీయ ఉప సంచాల కులు, భూపాలపల్లి, కాజీపేట ఐఐటి ప్రిన్సిపాల్స్ తో ఆడ్వాన్స్డ్ టెక్నాలజీన సెంటర్ లో ప్రవేశాలు, కళాశాలలో సౌకర్యాలు కల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన విద్యార్థిని, విద్యార్థులు భూపాలపల్లి, సుభాష్ నగర్ కాలనీలోని ఐటీఐ కళాశాలలో నేరుగా కానీ ష్ట్రబిబిజూబ:/తిబితి.బివశ్రీజీనిణజీనిజీ.ణనీల.తిని వెబ్సైట్ ద్వారా కానీ అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 19వ తేది వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులలో శిక్షణ పొందటానికి ప్రభుత్వ ఐటిఐ భూపాలపల్లిలోని ఖాళీగా వున్న సీట్లు భర్తీ కొరకు 6వ విడత వాక్ – ఇన్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు చేసేందుకు ఈ నెల 19వ తేది ఉదయం 11 గంటల వరకు అవకాశం

## ఐదేళ్ల చిన్నారికి హార్ట్ ఎటాక్

**కరీంనగర్ :** మనిషి ఆయుష్షు గుండెపోట్లతో బేజారవుతోంది. వయసుతో సంబంధం లేకుండా క్షణాల్లో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. అప్పటి వరకు కళ్లెదుటే ఆడుకున్న పాపాయి అకస్మాత్తుగా విగతజీవిగా మారింది. కరీంనగర్ జిల్లాలో ఈ విషాదకర ఘటన జరిగింది.ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన వయసు.. కష్టం, సుఖం అంటే ఏంటో కూడా తెలియని పసితనం. కానీ ఆ పసిప్రాణం గుండె జబ్బుతో బలైంది. అప్పటిదాకా ఆడుతూ పాడుతూ.. ఉల్లాసంగా కనిపించిన చిన్నారి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఇక సెలవంటూ వెళ్లిపోయింది. కరీంనగర్ జిల్లాలో మృతి చెందిన ఐదేళ్ల చిన్నారి గుండె జబ్బుతో చనిపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.చిరునవ్వులు చిందిస్తూ ఆడుతున్న ఈ చిన్నారి పేరు ఉక్కులు. వయసు కేవలం 5 సంవత్సరాలే. జమ్మికుంటకు చెందిన రాజు–జమున దంపతుల ముద్దుల కూతురు. ముద్దు ముద్దు మాటలు మాట్లడే తనంటే.. కుటుంబ సభ్యులకు ఎంతో ఇష్టం. ఇరుగుపొరుగువారు కూడా పాపను బాగా ముద్దు చేస్తారు. మంగళవారం ఉదయం నిద్రలేచి పాప.. కాసేపు ఆడుకుంది. ఆ తర్వాత అమ్మ వద్దకు వచ్చి తనకు కళ్లు తిరుగుతున్నాయని చెప్పింది. దీంతో పాపను తల్లి స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ బాలికను పరీక్షించిన డాక్టర్లు.. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని హన్మకొండ పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వెంటనే పాపను హన్మకొండకు తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు పరీక్షిస్తుండగానే బాలిక మృతి చెందింది.కాగా, పాపకు గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని.. ఆ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించలేకపోయారని డాక్టర్లు తెలిపారు. అందువల్లే గుండెపోటు వచ్చి ఉంటుందని అనుమానం వ్యక్తపరిచారు. ఎంతో ప్రేమగా పెంచుకున్నబిడ్డ మరణవార్త వినగానే ఆ తల్లిదండ్రుల ఆవేదన అంతా ఇంతా కాదు. గుండెపోటుతో చిన్నారి మృతిచెందిందని తెలియడంతో గ్రామంలో కూడా విషాదఛాయలు అలుముకున్నాయి. అప్పటివరకూ కళ్లెదుటే ఆడుకున్న పాపాయి అకస్మాత్తుగా విగతజీవిగా మారిపోవడంతో.. కుటుంబసభ్యులు గుండె పగిలేలా రోదిస్తున్నారు.

## కొనసాగుతున్న ఐటీ దాడులు

**హైదరాబాద్ :** తెలంగాణపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. అన్విత బిల్డర్స్, గూగి ప్రాపర్టీస్ అండ్ డెవలపర్స్ సంస్థల్లో సోదాలు గురువారం ఉదయం నుంచి సోదాలు చేస్తున్నారు. ఏక కాలంలో 30 చోట్ల ఐటీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.అన్విత బిల్డర్స్ అధినేత అచ్యుత్‌రావు, బొప్పరాజు శ్రీనివాస్, బొప్పన అనూప్ ఇళ్లు, పార్టనర్లు, బంధువులు ఇళ్లలో సోదాలు ముమ్మరం చేశారు. హైదరాబాద్, భువనగిరి, కొల్లూరు, రాయదుర్గం, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట సహా తెలంగాణలోని 30 చోట్ల ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు.ఐటీ చెల్లింపుల్లో ఆ కంపెనీ చేసిన అక్రమాలను గుర్తించారట అధికారులు. ఈ క్రమంలో సోదాలు జరుపుతున్నట్లు అధికారుల వెర్షన్. కేవలం హైదరాబాద్ మాత్రమే కాకుండా వివిధ ప్రాంతాల్లో భారీ ఎత్తున రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేస్తోంది.లావాదేవీల నేపథ్యంలో ఈ సోదాలు జరుగుతున్నాయని అంటున్నారు. సోదాల్లో లభించిన ఆధారాలతో ఇంకెన్ని విషయాలు వెలుగులోకి వస్తాయో చూడాలి

## బండ్లగూడలో దారుణం

**హైదరాబాద్ :** తన కూతురిని ప్రేమ పేరుతో లేపుకెళ్లిపోతున్నాడని అడ్డుకున్నందుకు ఓ తల్లిని ప్రేమికుడి ఫ్రెండ్స్ అత్యంత దారుణంగా చితకబాదారు. హైదరాబాద్ నగరం బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న సానియా బేగం భర్త చనిపోయాడు. ఆమెకి నలుగురు కూతుళ్లు కాగా, అందులో ఇద్దరికి వివాహాలు అయిపోయి అత్తవారింట్లో ఉంటున్నారు. ఇక మిగతా ఇద్దరు కూతుళ్లకి పెళ్లి కావాల్సి ఉంది. ఆ ఇద్దరు కూతుళ్లు ఈవెంట్లో జాబ్ చేసుకుంటూ తల్లితో పాటు కలిసి జీవిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉండగా, వాళ్ల ఇంటి సమీపంలో ఉండే హామీర్ అనే వ్యక్తి ఆ ఇద్దరిలో ఒక కూతురిని ప్రేమ పేరుతో ఇబ్బందులు పెడుతూ ఉండేవాడు. ఒకరోజు ఆ అమ్మాయిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లిపోతుండగా గమనించిన తల్లి ఆపే ప్రయత్నం చేసింది.గట్టిగా కేకలు పెడుతూ ఇరుగుపొరుగు వారిని సాయం కోసం పిలిచింది. తన కూతురిని ఆ వ్యక్తి అలా తీసుకెళ్లిపోతుండడం చూసి తట్టుకోలేని ఆ తల్లి ఎలాగైనా అతనిని ఆపాలని ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఈ క్రమంలో ఆ ప్రేమికుడితో పాటు అతని ఫ్రెండ్స్, బంధువులు తల్లి సానియాపై అత్యంత దారుణంగా దాడి చేసి పారిపోయారు. అయితే.. ఆ అబ్బాయే తన కూతురికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడా? లేదా ఆ కూతురే తనంతట తానుగా ఇష్టంతో వెళ్లిందా? అనేది తెలియాల్సి ఉంది. తన కూతురిని ప్రేమ పేరుతో వేధించి హింసించి తీసుకెళ్లిపోతుంటే ఆపే ప్రయత్నం చేసినందుకు ప్రేమికుడు, అతని ఫ్రెండ్స్ తనపై దాడి చేసినట్టు తల్లి సానియా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, మహిళపై దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులపై బండ్లగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారుపోలీసుల విచారణలో కొన్ని ఊహించని విషయాలు బయటికి వచ్చాయి. ఆ అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ తరచుగా మాట్లాడుకోవడంతోనే ఈ గొడవకి కారణం అయిందని తేలింది. అమ్మాయి, అబ్బాయి తరచుగా మాట్లాడుకుంటుంటే తన కూతురు చెప్పిన విషయాన్ని విని తల్లి ఆ అబ్బాయి కుటుంబంతో గొడవ పడింది. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఇరు కుటుంబాలు కొట్టుకున్నట్టు పోలీసులు చెబుతున్నారు

## సీఎం కప్ టార్చ్ ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే ఐలయ్య

**యాదాద్రి :** యువత చెడు వ్యసనాలకు, మత్తుపదార్థాలకు బానిస కావొద్దని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు.. యాదాద్రి–భువనగిరి జిల్లాలోని భువనగిరి కలెక్టర్ కార్యాలయ ప్రాంగణానికి చేరుకొని "సీఎం కప్ టార్చ్ ర్యాలీ" ని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం నుంచి భువనగిరి కోట వరకు నిర్వహించారు. ముందుగా కలెక్టర్ కార్యాలయం వద్ద కాగడ వెలిగించి జెండా ఊపి ఈ ర్యాలీ ని ప్రారంభించారు. పల్లెల నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికితీయడానికి సీఎం కప్ చక్కటి వేదిక అని అయన అన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉండే క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని రాష్ట్ర, జాతీయ, ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే ప్రయత్నమే సీఎం కప్ ఉద్దేశ్యమన్నారు.

## కిసాన్ పరివార్ దాతృత్వం

**మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా సెరోల్ మండలంలో కిసాన్ పరివార్ సీఈఓ వివేక్ విస్తృతంగా పర్యటించారు. ఏకలవ్య గురుకుల పాఠశాలలో పైప్లైన్ నిర్మాణం కోసం రెండు లక్షల రూపాయల చెక్ ను అందించి దాతృత్వం చాటుకున్నారు. కంపల్లి గ్రామంలో 3 లక్షలనీ పాఠశాల విద్యార్థులకు ఫ్యాన్ లను వాటర్ పైప్ లు వితరణ చేసారు. మండల కేంద్రంలో ని పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానీకి సహాయం అందించారు. నియోజకవర్గంలో పేద వర్గాలకు కిసాన్ పరివార్ అండగా ఉంటుందని హామి ఇచ్చారు.

## మూఢ నమ్మకాలతో ఊరంతా ఖాళీ

**నల్గొండ :** నల్గొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామం... ఇటీవల గ్రామంలో వరస మరణాలు సంభవించాయి. అనారోగ్యంతో కొంతమంది.. రోడ్డు ప్రమాదంలో మరికొందరు.. వయసు మళ్ళిన వారు మృత్యువాత పడ్డారు. గ్రామానికి కీడు దాపరించడంతోనే ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని భావించిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కీడు పోవాలంటే సూర్యోదయాన్ని కంటే ముందే పిల్ల పెద్దలతో సహా ఒకరోజు ఊరు ఊరంతా ఖాళీ చేసి సూర్య అస్తమయం వరకు ఊరు బయట ఉండాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. దీంతో గ్రామ ప్రజలంతా పొద్దు పొడవక ముందే ఇండ్లు విడిచి ఊరి పొలిమేరు దాటరు. అక్కడే వంట వార్పు చేసుకున్నారు. ఈ ఘటనతో ఊరంతా నిర్మానుష్యంగా మారింది. గత పది నెలల కాలంలో చిన్న పెద్ద బేధం లేకుండా 70 మంది వరకు గ్రామస్తులు మృత్యువాత వడ్డారని. దీనికి గ్రామానికి సోకిన కీడే కారణంగా భావిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కీడు పోవడానికే ఒకరోజు ఊరు విడిచి వెళ్లినట్లు చెప్పారు.

## వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర అందరికి ఆదర్శం

**సిద్దిపేట :** వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని ఒక సామాన్య వ్యక్తిగా పుట్టి బోయవాణిగా జీవితం గడిపి సప్తఋషుల బోధనలను ద్వారా మహర్షి వాల్మీకి మారి అద్భుతమైన రామాయణం గ్రంథాన్ని మనకు అందించిన మహనీయుడు వాల్మీకీ ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ఆదర్శవంతులుగా జీవించి మంచి పేరు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు

# రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి







**కామారెడ్డి, , శుభ తెలంగాణ** వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం రోజున గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామంలో పాక్స్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, వర్షాలు కురుస్తున్నాయి ధాన్యం తడిసి పోకుండా టార్పాలిన్ సిద్ధంగా ఉంచుకోవాలని, ధాన్యం తూకం వేయడానికి వేయింగ్ మిషన్, గాని సంచులు, తదితర ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. వరి పంటను రైతులు ఆర్బెట్టుకొని సెంటర్ కు తీసుకురావాలని తెలియజేయాలని సూచించారు. అలాగే ధాన్యం ను శుభ్రం చేసుకొని వ్వచ్చే విధంగా రైతులకు తెలియజేయాలని అన్నారు. ప్రతీ రైతుకు టోకెన్ జారీ చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన వరి నీ వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని, ప్రతీ సంచి పై సెంటర్ నెంబర్ , జిల్లా కోడ్ ను వేయాలని తెలిపారు. వరి ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రభాకర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, పౌరసరఫరాల అధికారులు, జిల్లా సహకార అధికారి, గ్రామస్తులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# ఈనెల 21న జరిగే పిడిఎస్ యు అర్థ శతాబ్ద ఉత్సవ విద్యార్థి ప్రదర్శనను జయప్రదం చేయండి

**ఖమ్మం , శుభ తెలంగాణ** 50 వసంతల ఉద్యమ గమనాన్ని సమక్షిస్తూ రేపటి కర్తవ్యాన్ని సవాలు చేస్తూ ఈనెల 21న ఉదయం 11 గంటలకు ఖమ్మంలో జరిగే పి డీ ఎస్ యు అర్థ శతాబ్ద ఉత్సవ విద్యార్థి ప్రదర్శన మరియు సాయంత్రం ఐదు గంటలకు రికబ్ బజార్ హై స్కూల్ పూర్వ ప్రస్తుత విద్యార్థి నాయకులతో జరిగే సదస్సును జయప్రదం చేయాలని పిడిఎస్ యు పూర్వ నాయకులు రాష్ట్ర నాయకులు టి వేణు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాల యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పి డి ఎస్ యు పూర్వ నాయకులు రాష్ట్ర నాయకులు టి వేణు ముఖ్య వక్తగా పాల్గొని మాట్లా డుతూ త్యాగాల పునాదులతో నెత్తుటి రహదారులలో ఏర్పడిన పిడిఎస్ యు త్యాగాల చరిత్రను ఉద్యమ గమనాన్ని సమక్షిస్తూ రేపటి కర్తవ్యాన్ని సమాజం పట్ల బాధ్య తను సవాలు చేస్తూ ఈనెల అక్టోబర్ 21న ఖమ్మంలో మరియు అక్టోబర్ 24న హైదరా బాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరగ బోయే పి డి ఎస్ యు అర్థ శతాబ్ద ఉత్సవ సభలను జయప్రదం చేయవల సిందిగా ప్రజలను ప్రజాస్వామ్యవాదులను మేధా వులను ప్రగతిశీల శక్తులను విప్లవ అభిమానులను విద్యార్థు లను మరియు కళాశాల యాజ మాన్యా లను కోరుతున్నాం. ఈ సభకు మాజీ పి డి ఎస్ యు రాష్ట్ర నాయకులు ప్రస్తుత కేంద్ర కమిటీ నాయకులు దివాకర్ అన్న ముఖ్య వక్తగా భోపాల్ యూని వర్సిటీ ప్రొఫెసర్ బుర్ర రమేష్ టి శ్రీనివాస్, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొం టారు. ఈ సదస్సును విజయ వంతం చేయాలని వారు ప్రస్తుత విద్యార్థులకు పూర్వ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో పిడిఎస్ఈ పూర్వ నాయకులు వెంకన్న గొరపాటి రమేష్ ఎస్కే సుభాన్ పాముల మోహన్ రావు ప్రస్తుత పిడిఎస్ యు జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఆర్ క్రాంతి మస్తాన్ జిల్లా నాయకులు సాగర్ రవి పాల్గొన్నారు.







# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**పంట పొలాల రహదారిని చదును చేయించిన విజయ రమణారావు**

**కాల్వ శ్రీరాంపూర్: , శుభ తెలంగాణ** రైతులు వెళ్లే రహదారి పూర్తిగా చెడిపోవడంతో పొలాలకు వెళ్లేందుకు అనుకూలంగా మొరం పోయించే కార్యక్రమం చేపట్టాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ఆదేశాలు ఇవ్వడంతో గురువారం వెన్నంపల్లి గ్రామంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, జెసిబి సహాయంతో పనులు ప్రారంభం చేశారు ఈ సందర్భంగా సారయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రజల రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం పని చేస్తుందని రైతులు గాని మహిళ కూలీలు గాని రహదారి వెంట పంట పొలాలకు వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా ఆయన ఆదేశాలతో మొరంపోసే పనులు ప్రారంభం చేశామని రైతులకు ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గాజనవేన సదయ్య, మాజీ ఎంపిటిసి జేట్టి దేవన్న, మాజీ సర్పంచ్ మాదాసి సతీష్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామ రైతులు పాల్గొన్నారు



## మిర్చి తోటలను సందర్శించిన కూసుమంచి మండల వ్యవసాయ శాఖ అధికారిణి రామడుగు వాణి

**ఖమ్మం , శుభ తెలంగాణ** కూసుమంచి మండలంలోని మునిగేపల్లి గ్రామంలో మిర్చి తోటలను మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిరపలో వేరు కుళ్ళు తెగులు గమనించడం జరిగిందనీ , నివార ణకు గాను కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రా లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 2.5 గ్రా లేదా కార్బెండేజిం 1 గ్రా, లీటర్ నీటికి కలిపి, మొక్క మొదలు భూమి తడిచేలా పిచికారి చేయా లనీ సూచి చారు. అదేవిధంగా బ్యాక్టీరి యా ఆకుమచ్చ తెగులు గమనించడం జరిగిందనీ,దీని నివారణకు గాను కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రాం స్ట్రెప్టోసైక్లిన్ 1గ్రా, 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేసు కోవాలి. మిరప మొక్కలు పసుపు రంగులోకి మారినట్లు గమనించడం జరిగితే యాజ మాన్యంలో భాగంగా మొక్క వయసు బట్టి 13-0-45 లేదా 19-19-19, 5-10 గ్రా, లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలనీ సూచించారు. అంతే కాకుండా మిరపలో పై ముడత గమనించడం జరిగిం దనీ నివారణకు వేప నూనె 1500 పీపీఎం 5 మి.లి మరియు ఫిప్రోనిల్ 2 మి లి లేదా ఎసిట మీప్రిడ్ 0.2 గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలనీ,కింది ముడత నివారణకు స్పైరోమేసిఫేన్ 1 మి.లి లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలనీ సూచించారు. ఈ కార్ర్యమంలో రైతులు రామ రాంబాబు ,కామినేని మాధవ రావు ,ఆది మొదలగు వారు పాల్గొన్నారు.





## బుద్ధుడి మార్గంలో పయనించాలి.

**బాణోత్ గజానంద్ నాయక్**



**నార్నూర్ అక్టోబర్ 17 , శుభ తెలంగాణ** బుద్ధుడి సిద్ధాంతాలను పాటిస్తూ అయన చూపిన శాంతి మార్గంలో పయనించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బాణోత్ గజానంద్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని త్రీరత్న బుద్ధ విహార్ లో నిర్వహించిన వర్ష్యావాస్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. శాంతి,కరుణ, మైత్రి సందేశాన్ని అందించిన బుద్ధుడి సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని అయన సూచించారు. అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఇంచార్జ్ చైర్మన్ సురేష్ ఆడే, మాజీ జడ్పీటీసీ కర్మన్కార్ హేమలత బ్రిజులాల్, వర్ష్యావాస్ నిర్వాహకులు బాలాజీ కాంబ్లే, లోఖండే కేశవ్ రావ్, మాజీ ఎంపీటీసీ రుక్మబాయి కాంతారావ్ దుర్గే,వినాయక్ రావ్, పుండలిక్ చాలూర్కార్, అన్నాభావు సాటే కమిటీ అధ్యక్షుడు కొర్రల మహేందర్, మస్కే కేశవ్, అవినాష్ ఆడే, సునీల్,నిర్మల బాయి, కాంబ్లే అనిత, భీంరావ్ జాడే, దయానంద్, మీనా బాయి, మాయ బాయి , చంద్రకళ, లోనా బాయి, పద్మినా బాయి, పంచశీలా, మరియు బౌద్ధ ఉపసిక ఉపసికులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



**కాల్వ శ్రీరాంపూర్: , శుభ తెలంగాణ** మండలంలోని గంగారం గ్రామానికి చెందిన కాల్వ శ్రీరాంపూర్ మొదటి జడ్పిటిసి కొక్కిస రవీందర్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి చిత్రపటానికి పూలమాలవేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాల్వ శ్రీరాంపూర్ మండలంలో మొట్టమొదటిసారి జడ్పిటిసిగా గెలుపొంది గ్రామాల అభివృద్ధికి కృషి చేశాడని మండలంలోని ప్రజలతోపాటు గంగారం గ్రామ ప్రజల మన్నలను పొందాడని మంచికి మారుపేరుగా ఉండేవాడని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, గంగారం గ్రామ మాజీ ఎంపీటీసీ కదురు మానస సతీష్, కొక్కిస వెంకన్న, జెక్కే రవీందర్ గౌడ్, నిదానపురం దేవయ్య, సింగిల్ విండో డైరెక్టర్ ముస్కు తిరుపతి, కూస సతీష్, వోడ్నాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

## ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం

**కాంగ్రెస్ కిసాన్ సెల్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నాగిరెడ్డి రమేష్ రెడ్డి**



**ఖమ్మం , శుభ తెలంగాణ** ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మరో పది రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్ధిదా రులకు ప్రభుత్వం గూడు కల్పించనున్నదని కాంగ్రెస్ కిసాన్ సెల్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నాగిరెడ్డి రమేష్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన వెలుగు నిఘా ప్రతినిధితో మాట్లాడు తూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీ పథకాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం మరో పది రోజుల్లో అమలు కానున్న దని, ఇండ్లు లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వగా రెండో ప్రాధాన్యతలో భూమి ఉన్నవారికి ఇండ్లు కట్టించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే నన్నారు. గత పాలకులు ఇచ్చిన హామీలు మరిచి ప్రజలను మోసం చేశారని వారు పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ మోసాలను నమ్మకనే గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారమిచ్చారన్నారు. ప్రజలు కోరుకున్న ఇందిరమ్మ పాలన సీఎం రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నా రని రేవంత్ రెడ్డి సారధ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని వారు పేర్కొన్నారు.

## కొత్తూరులో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**ధర్మారం, శుభ తెలంగాణ :** ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనను స్మరించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి రామాయణం రచించి, భారతదేశ సంస్కృతిని, కట్టుబాట్లను ప్రపంచానికి అందించిన గొప్ప మహాకవి అన్నారు. సమస్త మానవాళికి ఆదర్శప్రాయమైన శ్రీ రామాయణ మహాకావ్యాన్ని సంస్కృతంలో రచించి, ఆదికవిగా పేరుపొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ బోయ సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.



# అత్తిపండ్ల రసం తాగండి.. సర్వరోగాలను నివారించుకోండి



ఆరోగ్యానికి అంజీర్ చాలా మంచిది. ఇందులోని పోషకాలు శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. వీటిని అత్తి పండ్లు అని కూడా అంటారు. సాధారణంగా ఇవి అత్తి పండ్లు, ఎండినవి కూడా ఇందులో ఉంటాయి. వీటిని డైలీ తినడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి విముక్తి పొందవచ్చు. అయితే ఈ అంజీర్ పండు మార్కెట్లో దొరుకుతుంది. ఈ పండు జ్యూస్‌ని డైలీ తాగడం వల్ల సర్వ రోగాల నుంచి విముక్తి పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ జ్యూస్‌లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో బాగా ఉపయోగపడతాయి. డైలీ ఒక్కసారైనా ఈ పండ్ల జ్యూస్ తాగితే ఊబకాయం తగ్గడంతో పాటు రోగనిరోధక శక్తి కూడా మెరుగుపడుతుంది. వీటితో పాటు మలబద్దకం, పొట్ట సమస్యలు, జీర్ణ సమస్యలు అన్నింటి నుంచి కూడా విముక్తి పొందవచ్చు. ఈ అత్తి పండ్లలో ఎక్కువగా ఫైబర్, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటివి ఉంటాయి. ఇవి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. తాజా అత్తి పండ్లు లేదా ఎండిన అత్తి పండ్లతో అయిన జ్యూస్ చేసి తాగవచ్చు. ఎండిన అత్తి పండ్లు అయితే రాత్రంతా నానబెట్టిన తర్వాత జ్యూస్ చేసుకోవాలి. డైలీ ఈ జ్యూస్ తాగడం వల్ల నిద్రలేమి సమస్యల నుంచి విముక్తి పొందవచ్చు. రాత్రి నిద్రపోయే ముందు అంజీర్ పండును తిన్న లేకపోయిన జ్యూస్ తాగిన నిద్ర బాగా పడుతుంది. అలాగే తలనొప్పి, మైగ్రేన్ వంటి సమస్యల నుంచి కూడా విముక్తి కలిగిస్తుంది. చాలా మంది ఈరోజుల్లో మలబద్దకంతో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారు రోజూ ఈ జ్యూస్ తాగడం వల్ల సమస్య తగ్గుతుంది. దీర్ఘకాలికంగా ఈ సమస్యను తగ్గించగలిగే శక్తి అత్తి పండ్లకు ఉంది. వీటితో పాటు కిడ్నీల్లో రాళ్ల సమస్యలు ఉన్నవారికి కూడా ఈ పండ్లు బాగా ఉపయోగపడతాయి. ఇందులో యాంటీ యూరోలిథియాటిక్ రాళ్ల సమస్యలను తగ్గించడంలో ప్రధాన పాత్ర వహిస్తుంది. శ్వాసకోశ వ్యవస్థను మెరుగుపరచడంలో అత్తి పండ్లు బాగా ఉపయోగపడతాయి. అంజీర్ రసంలో ఫినోలిక్ యాసిడ్ ఉంటుంది. ఇది శ్వాసకోశ సమస్యల నుంచి విముక్తి కలిగించడంలో ప్రధాన పాత్ర వహిస్తుంది.

# అధికంగా మద్యం సేవిస్తే క్యాన్సర్లట!



ఈ మధ్య కాలంలో మారిన జీవనశైలి కారణంగా ఎక్కువ శాతం మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. దీని బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుంది. మన ఆహార అలవాట్లు, జీవనశైలి వల్ల ప్రమాదకరమైన క్యాన్సర్ వస్తుంది. అయితే ఈ రోజుల్లో చాలామంది అధికంగా మద్యం సేవిస్తుంటారు. మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరమని తెలిసిన కూడా పట్టించుకోకుండా సేవిస్తుంటారు. అసలు పండుగలు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. ఇక తాగే పనిలోనే ఉంటారు. అయితే అధికంగా మద్యం సేవిస్తే తప్పకుండా క్యాన్సర్ బారిన పడతారని అధ్యయనాలు చెబుతున్నాయి. కేవలం ఒక క్యాన్సర్ బారిన కాకుండా మొత్తం ఆరు రకాల క్యాన్సర్ల బారిన పడతారని ఇటీవల ఓ అధ్యయనంలో తేలింది. మరి ఆ ఆరు క్యాన్సర్లు ఏంటో తెలియాలంటే స్టోరీ మొత్తం చదివేయండి. తక్కువగా మద్యం తాగే వారిలో పెద్దగా క్యాన్సర్ లక్షణాలు లేవట. కానీ ఐదు శాతం కంటే ఎక్కువగా మద్యం సేవించిన వారికి తప్పకుండా ఈ ఆరు రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని పరిశోధకులు తెలిపారు. అధికంగా మద్యం సేవించడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్, మెడ క్యాన్సర్, పొట్ట క్యాన్సర్, పేగు క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, కాలేయ క్యాన్సర్ వంటివి వస్తాయని తాజా అధ్యయనాలు తెలుపుతున్నాయి. మూడు కన్నా ఎక్కువ సార్లు రోజులో ఆల్కహాల్ తీసుకుంటే ఈ క్యాన్సర్లు వస్తాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. కేవలం ఈ క్యాన్సర్లు మాత్రమే కాకుండా ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కూడా వచ్చే ప్రమాదం ఉంది. అయితే పురుషుల్లో అయితే ఎక్కువగా ప్రొస్టేట్ క్యాన్సర్ వస్తుందని నిపుణులు అంటున్నారు. దేశంలో ప్రతి ముగ్గురిలో ఇద్దరు క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. క్యాన్సర్‌తో చనిపోయే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. క్యాన్సర్ మద్యం వల్ల మాత్రమే కాకుండా జన్యుపరమైన కారణాలు, వంశపారంపర్యంగా కూడా వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు అంటున్నారు.

## హాయిగా నిద్రపోతున్నాము అనుకుంటున్నారా?



రోజూ 50 కోట్ల చర్మ కణాలు శరీరం నుంచి ఊడిపోతాయి. ఇవి డస్ట్ మైట్‌లకు మంచి విందు భోజనం. ఆ పురుగుల కారణంగా, వాటి విసర్జితాల కారణంగా అలర్జీ, ఉబ్బసం, ఎగ్జిమా వంటి సమస్యలు వస్తుంటాయి. బెడ్‌షీట్‌లు కూడా బ్యాక్టీరియాకు మంచి ఆశ్రయాలుగా ఉంటున్నాయి. 2013లో, ఫ్రాన్స్‌లోని ఇన్‌స్టిట్యూట్ పాశ్చర్ డి లిల్లే పరిశోధకులు హాస్పిటల్‌లోని పేషెంట్‌ల బెడ్‌షీట్ల మీద కూడా అధ్యయనం చేశారు. ఈ బెడ్ షీట్ లు స్టెఫిలోకాకస్ బ్యాక్టీరియాతో నిండి ఉన్నాయట. ఈ బ్యాక్టీరియా ఎక్కువగా మానవ చర్మంపై కనిపిస్తుంది. చాలా స్టెఫిలోకాకస్ జాతులు పెద్దగా హాని కలిగించేవి కాకపోయినా, ఎస్. ఆరియస్ వంటివి హానీ తలపెడతాయి. బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ కలిగిన వారికి చర్మ వ్యాధులు, మొటిమలు, న్యుమోనియా వంటి సమస్యలకు కారణం అవుతాయి. బ్యాక్టీరియా అనేది ప్రజల స్కిన్ మైక్రోబయోమ్‌లో భాగంగా ఉంటుంది. ఇవి చర్మం నుంచి పడిపోతుంటాయన్నారు యూకేలోని వెస్ట్‌మినిస్టర్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న మైక్రోబయాలజిస్ట్ మనల్ మహమ్మద్. ఈ బ్యాక్టీరియా ప్రమాదకరం కాదట. కానీ బయటి గాయాల ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తే మాత్రం తీవ్రమైన సమస్యలు వస్తాయి. రోగుల బెడ్‌షీట్‌లు, దిండు కవర్లను తరచుగా మారుస్తుంటారు. సో అక్కడే చాలా డేటా లభిస్తుంది. 2018లో, నైజీరియాలోని యూనివర్సిటీ ఆఫ్ ఇబాడాన్ శాస్త్రవేత్తలు ఉతకని హాస్పిటల్ బెడ్‌షీట్లలో మూత్ర నాళాల ఇన్‌ఫెక్షన్లు, న్యుమోనియా, డయేరియా, మెనింజైటిస్, సెప్సిస్‌లకు కారణమయ్యే ఇతర వ్యాధికారక బ్యాక్టీరియాతో పాటు ఈ. కొలిని కనుగొన్నారు. 2022లో మంకీపాక్స్‌తో ఆసుపత్రిలో చేరిన రోగుల గదుల నుంచి కూడా నమూనాలను సేకరించారట. బెడ్‌షీట్లను మార్చే క్రమంలో గాలిలోకి వైరస్ కణాలు విడుదల అవుతున్నట్లు వారు గుర్తించారు.

# మలబద్దకానికి సూపర్ ఫుడ్!



మలబద్ధకం కొందరికి దీర్ఘకాలిక సమస్యగా ఏర్పడుతుంది. మలబద్ధకంతో బాధపడేవారికి మజ్జిగ సూపర్ ఫుడ్. మజ్జిగలో కొన్ని పదార్థాల్ని కలిపి తాగితే మరింత ప్రయోజనం. వీటిలో ఉండే ఆయుర్వేద గుణాలు పొట్ట సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం పొందేలా చేస్తాయి. ఇంతకీ ఆ పదార్థాలేంటో ఇక్కడ తెలుసుకుందాం. మజ్జిగకు బదులుగా జీలకర్ర, రాక్ సాల్ట్ కలిపిన మజ్జిగను తాగండి. ఈ సూపర్ డ్రింక్ తాగితే మలబద్ధక సమస్య నుంచి రిలీఫ్ పొందవచ్చు. ఆహారంలో మన చేసే తప్పులు కారణంగా మలబద్ధకం సమస్య తలెత్తుతుంది అంటున్నారు నిపుణులు. జంక్ ఫుడ్ , ప్రాసెస్డ్ ఫుడ్ వంటి ప్యాక్ చేసిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకునే వారికి ఈ సమస్య మరింత ఎక్కువ బాధ పెడుతుంది. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తగినంతగా తీసుకోవాలి. కొన్ని మందుల దుష్ప్రభావాలు, తగినంత ద్రవాలు తీసుకోకపోవడం, మలవిసర్జన పోస్ట్ పోన్ చేయడం, ఆందోళన లేదా నిరాశ వంటివి కూడా మిమ్మల్ని ప్రభావితం చేస్తుంటాయి. మజ్జిగలో జీలకర్ర, రాక్ సాల్ట్, కొత్తిమీర కలిపి తగడం వల్వ మంచి జరుగుతుంది. దీని వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు మన ప్రేగులను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ సమస్యను అధిగమించడానికి, ఆహారంలో కూరగాయలు, పండ్లు, తృణధాన్యాల్ని చేర్చుకోండి. మజ్జిగలో ప్రోబయోటిక్స్ ఉంటాయి. ఇవి కడుపులో బ్యాక్టీరియా సమతుల్యతను కాపాడుతాయి. మజ్జిగ కడుపుని చల్లబరుస్తుంది. పేగుల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయం చేస్తుంది. జీలకర్రలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు గ్యాస్, ఎసిడిటీ నుంచి ఉపశమనం కలిగిస్తుంటాయి. ఇది జీర్ణ ఎంజైమ్‌లను క్రమబద్ధీకరిస్తుంది. జీలకర్రలో పోషకాలు మెండుగా ఉంటాయి. అంతేకాకుండా యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. గుండెని ఆరోగ్యంగా ఉంచుంది. జీవక్రియను వేగవంతం చేస్తుంది. మెటబాలిజం పెంపొందిస్తుంది. జీర్ణ సమస్యల్ని తొలగించడానికి జీలకర్ర బాగా సహాయపడుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యల్ని తగ్గిస్తుంది. ఎసిడిటీతో బాధపడుతున్నట్లుయితే.. జీలకర్రను తీసుకోవడం మంచిదంటున్నారు ఆయుర్వేద నిపుణులు.

# రాత్రిపూట ఈ పండ్లు తింటున్నారా!



పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయనే సంగతి మనందరికీ తెలుసు. విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు పండ్లలో పుష్కలంగా ఉంటాయి. ఇవి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయి. డైలీ లైఫ్‌లో పండ్లను యాడ్ చేసుకోవడం వల్ల ఎన్నో వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చు. మార్కెట్లో రకరకాల పండ్లు ఉంటాయి. డైలీ ఏదో ఒక పండును తినడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు స్కిన్ కూడా కాంతివంతంగా మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు తొందరగా రాకుండా యంగ్ లుక్ కనిపించేటట్లు చేస్తుంది. అయితే ఈ పండ్లను సరైన సమయంలో తినడం వల్లే శరీరానికి ఫలితం ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఏ పండును ఏ సమయంలో తినాలో.. అప్పుడు తింటేనే ఎలాంటి అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉంటారు. అయితే కొందరికి తెలియకుండా కొన్ని పండ్లను రాత్రిపూట తింటుంటారు. దీనివల్ల ఆ పండులోని పోషకాలు శరీరానికి అందకపోవడంతో పాటు సమస్యలను తీసుకొస్తుంది. మరి రాత్రిపూట ఏయే పండ్లు తినకూడదో ఈ స్టోరీలో తెలుసుకుందాం. సాధారణంగా పండ్లు ఏ సమయంలో అయిన తినవచ్చు. కానీ కొన్ని రకాల పండ్లను రాత్రిపూట తినకపోవడం మంచిది. ఎందుకంటే భోజనం చేసిన తర్వాత పండ్లను తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు తొందరగా పెరుగుతాయి. మారుతున్న జీవనశైలితో పాటు ఇలా తిన్న తర్వాత పండ్లను తీసుకోవడం వల్ల తొందరగా మధుమేహం వచ్చే ప్రమాదం ఉంది. అయితే పండ్లను భోజనం తర్వాత తినడం వల్ల నిద్రలేమి, మూత్ర సమస్యలు పెరుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే పండ్లలో నీటి శాతం అధికంగా ఉంటుంది. దీనివల్ల ఎక్కువసార్లు మూత్రానికి వెళ్లాల్సి వస్తుంది. కాబట్టి పండ్లను రాత్రిపూట తినడం తగ్గించడం మేలు. ఉదయం పూట పండ్లు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే రాత్రి పూట అరటి పండును తినకపోవడం మంచిది. ఎందుకంటే అరటి పండులో పోషకాలు మెండుగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణమే శక్తిని ఇస్తాయి. కానీ జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వీటితో అరటి పండును రాత్రిపూట తింటే జలుబు, దగ్గు వంటి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది.

# జలుబు నీరసంగా అనిపిస్తుందా..?



గత కొన్ని రోజులుగా వరుసగా వర్షాలు పడుతున్నాయి. అటువంటి పరిస్థితిలో వాతావరణం చల్లగా ఉంటుంది. దీంతో చాలా మంది గొంతు నొప్పి, తేలికపాటి దగ్గు, అలసట, శరీర నొప్పులతో బాధపడుతున్నారు. కొంతమందికి తేలికపాటి జ్వరం, తీవ్రమైన దగ్గు కూడా కనిపిస్తుంది. అయితే దీనికి కారణం ఏమిటి? మారుతున్న వాతావరణం వల్ల ఆరోగ్యం ఎందుకు క్షీణిస్తోంది? దీని గురించి నిపుణుల మాటల్లో తెలుసుకుందాం.. మారుతున్న వాతావరణంలో ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. దీని గురించి అస్సలు అజాగ్రత్తగా ఉండకూడదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే మారుతున్న వాతావరణంతో ఈ సమస్యలన్నీ సర్వసాధారణం. ఉదయం తీవ్రమైన వేడి ఉంటే, సాయంత్రం నాటికి మేఘాలు కమ్ముకుని వర్షం పడుతుంది. దీంతో చలి అనుభూతి కలుగుతుంది. ఇలా ఉష్ణోగ్రతలో వేగవంతమైన మార్పు శరీరంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. ఆర్ఎంఎల్ హాస్పిటల్ మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి మాట్లాడుతూ.. ఉష్ణోగ్రతలు వేగంగా మారే సమయంలో వ్యాధి నిరోధక బలహీనంగా ఉన్నవాళ్లు ఈ వాతావరణ మార్పును తట్టుకోలేరని చెప్పారు. రోగనిరోధక శక్తి బలహీనంగా మారితే జలుబు, దగ్గు, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పి వంటి సమస్యలు దాడి చేస్తాయి. దీంతో పాటు కొందరిలో దగ్గు పెరిగి, గొంతు సంబంధిత సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఈ సమస్యలన్నీ దీపావళి వరకు ప్రజలను ఇబ్బంది పెడతాయి. అందువల్ల, ఈ సమయంలో మీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మీ రోగనిరోధక శక్తిని ఆరోగ్యంగా ఉంచుకుంటే తద్వారా మారుతున్న వాతావరణం మిమ్మల్ని అనారోగ్యానికి గురిచేయదు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110